



# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక   PEN POWER TELUGU DAILY   ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11   సంచిక :121   పేజీలు :12   సంపాదకులు : గంట్యాడ అప్పారావు   ప్రచురణ : ఒంగోలు   ఆదివారం 5 జనవరి 2025   వెల : 5/-రూ॥

VOLUME :11   ISSUE : 121   PAGES :12   EDITOR : GANTYADA APPARAO   PUBLISHED :ONGOLE   SUN 5 JANUARY 2025   PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## చంద్రబాబు గారూ, ఇంతకన్నా మోసం ఏమైనా ఉంటుందా?



- 'ఎక్స్' వేదికగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ సీఎం
- ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై ఇంతటి బరితెగింపా? అంటూ మండిపాటు
- మేనిఫెస్టోపై ఇంతటి తేలిక తనమా? అంటూ జగన్ ఆగ్రహం
- 'తల్లికి వందనం' పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలన్న వైసీపీ అధినేత

పెన్ పవర్ డెస్క్:సీఎం చంద్రబాబు నాయుడుపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మరోసారి విమర్శలు గుప్పించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై ఇంతటి బరితెగింపా? మేనిఫెస్టోపై ఇంతటి తేలిక తనమా? ప్రజలకు ఇచ్చిన మాటను అమలు చేయకుండా

వివరాలు 2లో..

## జగన్ గాలిలో కాకుండా రోడ్లపైకి వచ్చి మేం చేసిన మంచిని చూడాలి

- విజయవాడలో లోకేశ్ ప్రెస్ మీట్
- తమది ప్రజా ప్రభుత్వమని స్పష్టీకరణ
- ఇచ్చిన హామీలే కాకుండా, హామీ ఇవ్వనివి కూడా అమలు చేస్తున్నామని వెల్లడి
- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎవరూ అడగకుండానే అమలు చేస్తున్నామని వివరణ




పెన్ పవర్ డెస్క్:విజయవాడ పాయకాపురం జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన అనంతరం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను పద్ధతి ప్రకారం నెరవేరస్తున్నామని స్పష్టం చేశారు. హామీ ఇవ్వని పథకాలను కూడా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఎవరూ అడగకుండానే ఇంటర్ విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గౌరవ పులివెందుల ఎమ్మెల్యే గారు గాలిలో కాకుండా రోడ్డుపైకి వచ్చి తాము చేస్తున్న మంచి పనులను చూడవచ్చని లోకేశ్ పేర్కొన్నారు. "జగన్ ప్రజల్లోకి వచ్చి సమస్యలు తెలుసుకోవడంలో తప్పులేదు. ఇప్పుడు రోడ్లు కూడా మంచివి వేశాం, ఆయన నిర్భయంగా రోడ్లపైకి రావచ్చు. ఇంకా మేం చేయాల్సి చాలా ఉంది, అన్నీ చేస్తాం. జగన్ వచ్చి మేం అమలు చేస్తున్న మంచి కార్యక్రమాలు చూడాలని కోరుతున్నాం. రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తాం. గత ప్రభుత్వంలో మాదిరి మాది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం కాదు. ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నాం. ప్రజాదర్బార్ ద్వారా సమస్యలు తెలుసుకుంటున్నాం. గత ప్రభుత్వ తప్పుల వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకుంది. రూ.4 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4 వేల పెన్షన్ అందజేస్తున్నాం. గత ప్రభుత్వం మూసివేసిన అన్నక్యాంటీన్లు తెరిచాం. ఉచిత గ్యాస్ పథకాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నాం" అని వివరించారు.

## అదానీతో జగన్ ఒప్పందం ఏపీకి చాలా లాభం



పెన్ పవర్ డెస్క్:ప్రముఖ పారిశ్రామిక వేత్త అదానీకి చెంది అదానీ గ్రూప్ సంస్థలపై అమెరికాలో అవినీతి ఆరోపణలు రావడం ఏపీలో దుమారం రేపిన సంగతి తెలిసిందే. అదానీ స్కాంలో మాజీ సీఎం జగన్ ప్రమేయం ఉందంటూ అధికార కూటమి నేతలు పెద్ద ఎత్తున ఆరోపణలు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అదానీతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో అవినీతి జరిగిందంటూ కూటమి నేతలు ఆరోపించిన సంగతి తెలిసిందే. అయితే... అదానీతో జగన్ చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఏపీకి చాలా లాభమని సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.ఆదానీతో గత ప్రభుత్వం చాలా తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకుందని..

వివరాలు 2లో..

## తమిళనాడులో ఘోర ప్రమాదం... బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

- మంటల్లో చిక్కుకుని ఆరుగురు దుర్మరణం
- శనివారం తెల్లవారుజామున ప్రమాదం
- సాతూర్ కర్మాగారంలో భారీగా ఎగిసిపడిన మంటలు



పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో ఘోర ప్రమాదం జరిగింది. బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు సంభవించింది. శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ పేలుడులో ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే చనిపోయారు. మరికొంతమంది కార్మికులు గాయపడ్డారు. విరుద్ నగర్ జిల్లాలోని

వివరాలు 2లో..

## గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు పవన్ వస్తుండడంతో భారీ ఏర్పాట్లు



- రాజమండ్రిలో నేడు గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఫంక్షన్
- ముఖ్య అతిథిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఏర్పాట్లను పరిశీలించిన సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా, స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న గేమ్ చేంజర్ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నేడు రాజమండ్రిలో గ్రాండ్ నిర్వహించనున్నారు. ఈ వేడుకకు ఏపీ డిప్యూటీ సీ ఎం పవన్ కల్యాణ్ ముఖ్య

## బీజేపీ, కాంగ్రెస్‌లపై అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర విమర్శలు

- పంజాబ్‌లో హామీలు నెరవేర్చలేదంటూ కేజ్రీవాల్ నివాసం ఎదుట మహిళల ధర్నా
- బీజేపీ, కాంగ్రెస్ కావాలని తమపై దాడి చేస్తున్నాయని కేజ్రీవాల్ ఆగ్రహం
- ఢిల్లీలో రెండు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని ఆరోపణ
- తమపై ఉమ్మడిగా పోటీ చేస్తున్నామని బీజేపీ, కాంగ్రెస్ ప్రకటన చేయాలని డిమాండ్

పెన్ పవర్ డెస్క్:బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ సీఎం కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. త్వరలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఇప్పటికే బీజేపీ 29 మందితో తొలి జాబితాను విడుదల చేసింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీలు కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను

వివరాలు 2లో..



## ఆ మూడు తేదీల్లోనే శ్రీవారిని దర్శించుకోవాలని అనుకోవద్దు

- తిరుమలలో జనవరి 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు
- 10, 11, 12 తేదీల్లోనే దర్శించుకోవాలని అనుకోవద్దన్న బీఆర్ నాయుడు
- ఈ నెల 19 వరకు ఎప్పుడైనా దర్శించుకోవచ్చని సూచన



పెన్ పవర్ డెస్క్:త్వరలో తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తున్న నేపథ్యంలో, భక్తులకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కీలక విజ్ఞప్తి చేశారు. జనవరి 10 నుంచి 19 వరకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరిచే ఉంటాయని... జనవరి 10, 11, 12 తేదీల్లోనే స్వామివారిని దర్శించుకోవాలని అనుకోకండి అని పేర్కొన్నారు.

వివరాలు 2లో..

## చంద్రబాబు, లోకేశ్ బాధ్యత కలిగిన వారు కాబట్టి అలాంటి పనులు చేయలేదు



- ఏపీలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- పాయకాపురం జూనియర్ కాలేజీలో కార్యక్రమానికి లోకేశ్, సత్యకుమార్ హాజరు
- గతంలో దైవాంశ సంభూతుల్లా పేర్లు పెట్టుకున్నారని సత్యకుమార్ విమర్శలు

పెన్ పవర్ డెస్క్:ఏపీలో నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. విజయవాడ పాయకాపురం జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనా విధానానికి అనుగుణంగా విద్యార్థులంతా మెరుగైన ఫలితాలు సాధించి స్వర్ణాంధ్రప్రదేశ్ లో

వివరాలు 2లో..

## ప్రతి సోమవారం ఫిర్యాదులు స్వీకరిస్తాం... ఆధారాలతో రావాలి

- ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తామని వెల్లడి
- మధ్యలో 2 నుంచి 3 గంటల వరకు బ్రేక్!
- ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:అక్రమ నిర్మాణాలకు సంబంధించి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి ప్రతి సోమవారం హైదరాబాద్ నగర ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. హైదరాబాద్‌లోని హైడ్రా కార్యాలయం ఉన్న బుద్ధ భవన్‌లో ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, ఆ తర్వాత 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు.అయితే ఫిర్యాదుదారుడు ఫిర్యాదు చేసే ముందు పూర్తి ఆధారాలు, వివరాలతో రావాలని సూచించారు. ఈ విషయంలో అనుమానాలు ఉంటే హైడ్రా కార్యాలయాన్ని సంప్రదించవచ్చని చెప్పారు. 040-29565758, 040-29560596 నెంబర్లకు ఫోన్ చేసి కూడా అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. ప్రాధాన్యతా క్రమంలో

వివరాలు 2లో..



### వాడుక భాషలో 70 శాతం ఆంగ్లపదాలే...

## తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి



- మాట్లాడటం, రాయడం ద్వారా భాషను పరిరక్షించుకోగలమన్న కిషన్ రెడ్డి
- తెలుగు భాష కనుమరుగు కాకముందే రక్షించుకోవాలన్న కేంద్రమంత్రి
- కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని అమలు చేయాలని సూచన

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:వాడుక భాషలో 30 శాతమే తెలుగు ఉందని, 70 శాతం ఆంగ్ల పదాలే ఉన్నాయని, మనకు తెలియ కుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోందని



## విశాఖ సాగర తీరంలో సాహస విన్యాసాలు.. అట్టహాసంగా 'నేవీ డే'

- విశాఖలో నేవీ డే వేడుకలు... కుటుంబ సమేతంగా హాజరైన సీఎం చంద్రబాబు
- భారత నేవీ విన్యాసాలకు వేదికగా విశాఖ ఆర్కే బీచ్
- ముఖ్య అతిథిగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- నేవీ విన్యాసాలను ఆసక్తిగా తిలకించిన చంద్రబాబు, భువనేశ్వర్, దేవాన్ష్

వివరాలు 2లో..

విశాఖ తీరం భారత నేవీ విన్యాసాలకు వేదికగా నిలిచింది. ఇక్కడి ఆర్కే బీచ్ లో ఏర్పాటు చేసిన నేవీ డే వేడుకలకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి, మనవడు దేవాన్ష్ కూడా



## ఎడిటర్ వ్యూ

# డాలర్ డ్రీమ్స్ కు కష్టాలు...

అమెరికాలో 1958లో కేవలం 12,000 మంది మాత్రమే ప్రవాస భారతీయులు ఉండేవారు. రానురాను వారి ప్రాముఖ్యత పెరిగి ఇప్పుడు అమెరికా మొత్తం జనాభాలో 1.5% వరకు ప్రవాస భారతీయులు ఉనికిని పొందడం విశేషం. సిఇఒలుగా, సైంటిస్టులుగా, ఆస్ట్రోనాట్లుగా, విధానపర నిర్ణేతలుగా, చట్టసభ సభ్యులుగా ఇలా అనేక రంగాల్లో ప్రవాస భారతీయులు విస్తరిస్తుండటంతో అమెరికాలో పుట్టి పెరిగిన అసలైన అమెరికన్లకు దక్కవలసిన ఉద్యోగాలు, పదవులు ప్రవాసీయులకే దక్కుతున్నాయన్న అపోహలు మొదలవుతున్నాయి. ఇది చివరకు హెచ్1బి వీసాలపై ప్రభావం చూపిస్తోంది. మేక్ ఎగైన్ గ్రేట్ అమెరికా 'మాగా' నినాదంతో రెండోసారి విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌కు హెచ్1బి వీసాల వివాదం అగ్నిపరీక్షగా మారింది. ప్రవాసీయుడైన ఎలాన్ మస్క్‌కు పెద్ద పీట వేయడం వివాదాస్పదమవుతోంది. ఇది మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) అన్న ట్రంప్ ప్రధాన నినాదానికి తూట్లు పొడుస్తోంది. న్యూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీసియెన్సీ(డిఒజిఇ) అధినేతగా ఎలాన్‌మస్క్, ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్, పౌరహక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా హర్మీత్ కె ధిల్లాన్, జాతీయ ఆరోగ్య సంస్థ డైరెక్టర్‌గా డాక్టర్ జయభట్టాచార్య, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సీనియర్ పాలసీ అడ్వైజర్ శ్రీరామ్ క్రిష్ణన్‌తో పాటు వివేక్ రామస్వామి వంటి భారతీయ మూలాలున్న ఆరుగురిని ట్రంప్ తన యంత్రాంగంలో కీలక స్థానాల్లో నియమించారు. ఇది 'మాగా' నినాదానికి విరుద్ధమని వలసవాద, ఇస్లామిక్ వ్యతిరేక ఉద్యమ నేత లారా లూమెర్ ధ్వజమెత్తుతున్నారు. ట్రంప్ నియమించిన వారిలో శ్రీరామ్ క్రిష్ణన్ చెన్నైకు చెందినవారు. ఇండియా ఫస్ట్ అన్న నినాదానికి ఆయన కట్టుబడి ఉన్నారని, ఇది 'అమెరికా ఫస్ట్ అన్న లక్ష్యానికి వ్యతిరేకమని లారా లూమెర్ ఆగ్రహిస్తున్నారు. అయితే హెచ్1బి వీసాల్లో 70% భారతీయు లే పొందుతున్నారని, వీరంతా భారత్ నుంచి వచ్చే మూడో ప్రపంచ ఆక్రమణదారులని లూమెర్ ఆరోపిస్తున్నారు. హెచ్1బి వీసాదారుల్ని కాంట్రాక్టుగా తీసుకోవడంలో ఎలాంటి ప్రత్యేక నైపుణ్య ప్రమాణాలు కనిపించడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. పైగా ఏటా వారికి 80 వేల డాలర్ల నుంచి 1,20,000 డాలర్ల వరకు చెల్లించుకోవలసి వస్తోందని నిలదీస్తున్నారు. ఈ వాదాన్ని వివేక్ రామస్వామి, ఎలాన్ మస్క్ తదితరులు తిప్పికొడుతున్నారు. వాస్తవానికి ఎలాన్ మస్క్ దక్షిణాఫ్రికా నుంచి అమెరికాకు హెచ్1బి వీసా పైనే వచ్చారు. విదేశీ ప్రతిభతో అమెరికా ప్రయోజనం పొందుతుంది తప్ప అమెరికా వాసుల ప్రయోజనాలకు, హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదని మస్క్, రామస్వామి తమ వాదన వినిపిస్తున్నారు. చేతిలోపైసా లేకుండా అమెరికాకు వలస వచ్చిన గొప్ప ఇంజినీర్ నికోలా టెస్లా స్ఫూర్తితోనే తన కారుకు టెస్లా అని పేరు పెట్టినట్టు మస్క్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికాలో విద్యుత్ విప్లవానికి నికోలా టెస్లా మూలకారకుడని మస్క్ ఉదహరించారు. అమెరికాకు సమర్థత కలిగిన ప్రజలు కావాలని తానెల్లప్పుడూ భావిస్తానని, తెలివైనవారు మన దేశానికి రావాలని, ఇదివరకెన్నడూ లేని స్థాయిలో అమెరికాలో ఉద్యోగాలు రాబోతున్నాయని కొత్త సంవత్సరం సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడడం ఈ సందర్భంగా గమనించాల్సిన విషయం. అమెరికా తక్కువ స్థాయిలో నైపుణ్యం గల గ్రాడ్యుయేట్‌లను తయారు చేస్తున్నందున ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చే నైపుణ్యం గల వారిని దేశంలోకి అనుమతించడానికి హెచ్1బి వీసా ఉపయోగపడుతుందని మస్క్, వివేక్ రామస్వామి కూడా పేర్కొంటున్నారు. ప్రపంచ దేశాల్లో అమెరికా ఎప్పటికీ మొదటి స్థానంలో ఉండాలంటే ఈ ప్రోగ్రాంకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రత్యేక నిపుణులైన విదేశీయులను మరింత తేలికగా నియమించుకోడానికి అమెరికా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ బైడెన్ కార్యవర్గం నిబంధనల్లో మార్పులు చేసింది. ట్రంప్ మొదటిసారి పాలనలో వీసాలపై ఉన్న అభిప్రాయాలకు ఇప్పటి వైఖరికి తేడా కనిపిస్తోంది. 2017లో బై అమెరికన్, హైర్ అమెరికన్ అన్న సిద్ధాంతానికి వత్తాసు పలికారు. ఫలితంగా 2015 నుంచి హెచ్1బి వీసాల మంజూరు మందగించింది. 2020లో అమెరికాలోని సంస్థలు విదేశాల నుంచి ఉద్యోగులు, కార్మికులను తెచ్చుకునే విధానానికి ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నిలకడ లేని విధానాలతో మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) మద్దతుదారులు హెచ్1బి వీసా అసలు ప్రయోజనాలను తప్పుగా అర్థం చేసుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యను ట్రంప్ ఈసారి ఎలా పరిష్కరిస్తారో చూడాలి. హెచ్1బి వీసాలపై ఆంక్షలు ఎక్కువ చేస్తే అమెరికా కంపెనీలు విదేశాల్లో అనుబంధ సంస్థలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. ప్రత్యామ్నాయంగా చైనా, కెనడా వంటి దేశాల వైపు మొగ్గు చూపే పరిస్థితి ఏర్పడుతుందని మరో అధ్యయనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ పాలనా యంత్రాంగంలో 'మాగా' గ్రూపు ఆలోచనలను మార్చడానికి భారత ప్రభుత్వం గట్టిగానే పని చేయవలసి వస్తుంది. భారత్‌కు ఆదాయం తెచ్చిపెట్టే దేశాల్లో అమెరికా టాప్‌లో ఉంది. గత ఏడాది 120 బిలియన్ డాలర్ల వరకు భారత్‌కు అమెరికా నుంచి ఆదాయం సమకూరింది. ఈ ఆదాయ స్రవంతిని భారత్ దొరకబుచ్చుకోగలగాలి. అలాగే అమెరికాను ఆకర్షించడానికి సాంకేతిక నైపుణ్యంలో టాప్‌లో భారతీయులు ఉన్నప్పుడే ఎలాంటి చిక్కులు వీసాల్లో ఎదురుకావు.

# చంద్రబాబు గారూ, ఇంతకన్నా మోసం ఏమైనా ఉంటుందా?

- మొదటి పేజీ తరువాయి

టేక్ ఇట్ గ్రాంటెడ్‌గా తీసుకుంటారా? లక్షలమంది తల్లులకు, పిల్లలకు, రైతులకు ఇంతటి ద్రోహం తలపెడతారా? అంటూ జగన్ ట్వీట్ చేశారు.

"అధికారంలోకి వస్తే 'తల్లికి వందనం' అని, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఏడాదికి రూ.15వేలు చొప్పున ఇస్తామన్నారు. అధికారంలోకి రాగానే అంతకుముందు మేం ఇస్తున్న 'అమ్మ ఒడి' పథకాన్ని సైతం ఆపేశారు. వరుసగా కేబినెట్ సమావేశాలు జరుగుతున్నాయి కానీ, తల్లికి వందనం పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారో నిర్దిష్టంగా చెప్పలేదు. తీరా ఈ ఏడాదికి ఇవ్వమని కేబినెట్లో తేల్చిచెప్పేశారు. ఇంతకన్నా మోసం ఏమైనా ఉంటుందా? ఇంతకన్నా పచ్చి దగా ఏమైనా ఉంటుందా? చంద్రబాబుగారూ... ఎన్నికల వేళ మీరు, మీ కూటమి నాయకులు రాష్ట్రంలోని ప్రతిచోటా 'తల్లికి వందనం'పై చేసిన ప్రచారం అంతా ఇంతాకాదు. ఇంటింటికీ తిరిగి కనిపించిన ప్రతి పిల్లాడినీ పట్టుకుని నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు అన్నారు. ఇద్దరుంటే రూ.30వేలు ఇస్తామని, అదే ముగ్గురు ఉంటే రూ.45వేలు ఇస్తామన్నారు. నలుగురు ఉంటే రూ.60వేలు అన్నారు. ప్రజలకు మీరుచేసిన వాగ్దానం, మీరు చెప్పిన మాటలు ఆడియో, వీడియోల రూపంలో సాక్ష్యాధారాలుగా ప్రతిఒక్కరి సెల్‌ఫోన్‌లో ఉన్నాయి. వైసీపీ హయాంలో 44.48 లక్షల మంది తల్లులకు, దాదాపు 84 లక్షల మంది పిల్లలకు, రూ.26,067 కోట్లను మేము అందించి, అత్యంత విజయవంతంగా అమలుచేసిన అమ్మ ఒడిని ఆపేసినా, మీరు ఇస్తామన్న పథకం వస్తుందేమోనని బడికి వెళ్లే ఆ పిల్లలు, వారి తల్లులు ఈ 7-8నెలలుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. చివరకు వారి ఆశలపై నీళ్లు జల్లి, ఈ ఏడాది ఇవ్వమని నిస్సిగ్గుగా చెప్తున్నారు. ప్రజలకు ఒక మాట ఇచ్చి, దాన్ని నమ్మించి, వారి ద్వారా అధికారాన్ని తీసుకుని, ఇప్పుడు ఇవ్వలేమంటూ ఎలాంటి సంకోచంలేకుండా చెప్తున్నారు. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయడం, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కడం మీకు అలవాటుగా మారిపోయింది.

ఇక 'రైతు భరోసా' తీరు కూడా అలానే ఉంది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ రెండు సీజన్లు అయిపోతున్నా ఇవ్వకుండా గడిపేశారు. అదిగో, ఇదిగో అంటూ లీకులు ఇస్తున్నారు కాని, ఇప్పటివరకూ రైతులకు పెట్టుబడి సహాయం కింద ఒక్కపైసా ఇవ్వలేదు. అధికారంలోకి వచ్చిన ఆ ఏడాదే 2019 అక్టోబరులో ప్రారంభమై, అప్పటినుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం రూ.13,500 చొప్పున 53.58 లక్షల రైతుల చేతిలో, రూ.34,378కోట్లు మేము పెట్టాం. కేంద్రం ఇచ్చేది కాకుండా మీరు ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు ఖరీఫ్ అయిపోయిందీ, రబీకూడా అయిపోయింది. ఒక్కపైసా ఇవ్వలేదు. ఇన్ని కేబినెట్ మీటింగ్‌లు పెట్టుకున్నా%ా% ఎప్పుడు ఇస్తారో చెప్పడంలేదు. ఇది రైతులను నిలువెల్లా మోసం చేయడం కాదా? రైతులకు పెట్టుబడి సహాయం లేదు, కనీస మద్దతు ధరా అందడంలేదు. ఉన్న ఉచిత పంటలబీమాను రద్దుచేశారు. ఆర్బీకేలను నిర్వీర్యం చేశారు. సంక్షోభంలో ఎవరైనా రైతులు దురదృష్టవశాత్తూ ఆత్మహత్య చేసుకుంటే కనీసం ఆ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడంలేదుకదా, కనీసం పరామర్శకు కూడా నోచుకోవడం లేదు. ప్రతి పిల్లాడికి రూ.15వేలు చొప్పున ఎంతమంది పిల్లలు ఉంటే, అంతమందికీ అన్న తల్లికి వందనం అయినా మోసమే, రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఇస్తామన్నదీ మోసమే, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ రూ.18వేలు అయినా

మోసమే, నిరుద్యోగభృతి కింద ప్రతి పిల్లాడికీ రూ.36వేలు అయినా మోసమే. 50 సంవత్సరాలు నిండిన ప్రతి అక్కకూ రూ.48వేలు అయినా మోసమే, ఇంటింటికీ సేవలు అందిస్తూ మంచికి అర్థం చెప్పిన వాలంటీర్లకూ మీరు చేసింది మోసమే. ఈ మోసాలు అన్నింటికీ తోడు, మీ పాలనలో ప్రజలపై ఛార్జీలతో బాదుడే బాదుడు కనిపిస్తోంది. ప్రతి అడుగులోనూ స్కాంలే. ఇసుకను వదలడంలేదు, మద్యాన్ని వదలడంలేదు.

చంద్రబాబుగారూ... రోజులు గడుస్తున్నకొద్దీ, మీరు చేస్తున్న మోసాలు ఒక్కొక్కటీ బయటకు వస్తూనే ఉన్నాయి. ఇవి ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తున్నాయి. ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి, వారి గొంతుకై నిలుస్తుంది. ప్రజలకు మీరు ఇచ్చిన వాగ్దానాల అమలుకోసం వారి తరఫున నిలబడుతుంది" అని జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## విశాఖ సాగర తీరంలో సాహస విన్యాసాలు..

# అట్టహాసంగా 'నేవీ డే'

- మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నేవీ విన్యాసాల నేపథ్యంలో ఆర్కే బీచ్ పరిసరాల్లో ప్రైవేటు డ్రోన్లపై నిషేధం విధించారు. ఈ విన్యాసాల్లో వివిధ రకాల యుద్ధ నౌకలు, అత్యాధునిక వ్యవస్థలతో కూడిన లాంగ్ రేంజి యాంటీ సబ్ మెరైన్ వార్ ఫేర్ ఎయిర్ క్రాఫ్ట్ పీ8ఐ, నేవీ డోర్నియర్ విమానాలు, హాక్ జెట్ విమానాలు, సీకింగ్ హెలికాప్టర్లు, ఏఎల్ హెచ్ హెలికాప్టర్లు పాల్గొన్నాయి. హెలికాప్టర్లు రకరకాలు ఆకృతుల్లో చేపట్టిన విన్యాసాలు అందరినీ అలరించాయి. చంద్రబాబు, భువనేశ్వరి, దేవాన్ష్ ఆ విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో నేవీ బ్యాండ్ బీటింగ్ రిట్రీట్ కూడా ప్రదర్శించింది. ఇక, చీకటి పడ్డాక సముద్ర తీరానికి దగ్గరగా వచ్చిన యుద్ధ నౌకలు విద్యుత్ దీప కాంతులతో జిగేల్మన్నాయి. ఆ నౌకలను లైటింగ్ తో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు.

# చంద్రబాబు, లోకేశ్ బాధ్యత కలిగిన వారు కాబట్టి అలాంటి పనులు చేయలేదు

- మొదటి పేజీ తరువాయి

భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

"ప్రభుత్వ విద్యకు మళ్లీ పూర్వవైభవం తెచ్చేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారు. జూనియర్ కాలేజిల్లో మధ్యాహ్న భోజన పథకం మొదటిసారిగా అమలుగా చేసున్నది ఏపీలో మాత్రమే. ఇందుకోసం ప్రభుత్వం రూ.90 కోట్లు ఖర్చు చేస్తోంది. ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషిచేస్తున్నాం. మార్కెట్లో గుడ్ల రేటు తగ్గినా, వీళ్లు (వైసీపీ) రేటు తగ్గించకుండా గతంలో ఎంతో అవినీతికి పాల్పడ్డారు. గుడ్లపై కూడా స్టాంపు వేసుకున్నారు. వారి పేర్లతో దీవెనలు, కానుకలని పేర్లు పెట్టుకున్నారు. వారి సొంత ఖజానానుంచి ఏమైనా ఇచ్చారా? ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్ వారి పేర్లు పెట్టుకున్నారా? బాధ్యత కలిగిన వారు కనుక ఆ పనులు చేయలేదు. తల్లిదండ్రులు, గురువు, దేవుడికి మాత్రమే దీవెనలు ఇచ్చే అర్హతలు ఉన్నాయి. తాము దైవాంశ సంభూతులమని ఎవరన్నా అనుకుంటే వారిని దూరంగా ఉంచండి. అటువంటి వ్యక్తులు, శక్తులను దూరంగా పెట్టండి. రాష్ట్రంలో యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్ సెన్సస్ చేస్తున్నారు. మీ గురించి ఆలోచించే డైనమిక్ మంత్రి (నారా లోకేశ్) ఉన్నారు. నైపుణ్య శిక్షణ ఇచ్చి, రాబోయే రోజుల్లో మీ కాళ్లపై మీరే నిలబడేలా కృషి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానం రాబోయే రోజుల్లో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తుంది. ఇప్పుడు మనం నాలెడ్జి ప్రాక్టీషనర్స్ గా ఉన్నాం, నాలెడ్జి ప్రొడ్యూసర్స్ గా లేము. రాబోయే రోజుల్లో ప్రొడ్యూసర్స్ గా తయారు కావాల్సి ఉంది. గూగుల్, యాపిల్ వంటి సంస్థలు ఇక్కడే ఏర్పాటవుతాయి" అని మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు.

ఇక, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో 34 లక్షల మంది విద్యార్థుల ఆరోగ్య వివరాలను హెల్త్ కార్డుల్లో పొందుపరుస్తున్నామని సత్యకుమార్ తెలిపారు. పిల్లలు ఎనీమియా బారిన పడకుండా ఆర్ కె ఎస్ కె కార్యక్రమాన్ని ప్రారంభించామని వెల్లడించారు.

**లోకేశ్ ను చూసి నేర్చుకోవాలి: ఎంపీ కేశినేని చిన్ని**

ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ... మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి నివసించే ప్రాంతంలో మధ్యాహ్న భోజన ప్రారంభించడం హర్షణీయం అన్నారు.

"స్వర్గీయ ఎన్టీఆర్ నాడు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు... ఇవాళ ఆయన మనవడు లోకేశ్ ఇంటర్ విద్యార్థులకు ప్రారంభించడం ఆనందంగా ఉంది. విద్యాశాఖలో అనూహ్య మార్పులు తెస్తున్న లోకేశ్ కు అభినందనలు. ఎంత ఎదిగితే అంత ఒదిగి ఉండాలనే సూత్రాన్ని విద్యార్థులంతా లోకేశ్ ను చూసి నేర్చుకోవాలి. ఆయన అమెరికా వెళ్లి గూగుల్, టెస్లా వంటి కంపెనీల చుట్టూ తిరిగారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు" అని కొనియాడారు.

# బీజేపీ, కాంగ్రెస్‌లపై అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర విమర్శలు

- మొదటి పేజీ తరువాయి

నెరవేర్చడం లేదంటూ పలువురు మహిళలు ఢిల్లీలోని కేజ్రీవాల్ నివాసం వద్ద నిరసనకు దిగారు. ఈ నిరసనపై కేజ్రీవాల్ స్పందించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కావాలని తమపై అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆ రెండు పార్టీలు ఢిల్లీలో కూటమిగా ఏర్పడి తమపై దాడి చేస్తున్నాయని ధ్వజమెత్తారు. తన ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన మహిళలు ఆ రెండు పార్టీలకు చెందిన వారేనని ఆరోపించారు. ఆ మహిళలు పంజాబ్ నుంచి రాలేదన్నారు. పంజాబ్‌లో తమకే మద్దతు ఉందన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీపై పోటీ చేస్తున్నామని బీజేపీ, కాంగ్రెస్ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

# గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు పవన్ వస్తుండడంతో భారీ ఏర్పాట్లు

- మొదటి పేజీ తరువాయి

అతిథిగా హాజరవుతున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినిమా వాళ్లు, రాజకీయ నేతలు హాజరవుతున్నారు కాబట్టి ఇదొక ముఖ్యమైన ఈవెంట్ అని తెలిపారు. డిప్యూటీ సీఎం ఈ కార్యక్రమానికి వస్తుండడంతో... జిల్లా కలెక్టర్, ఎస్పీ సూక్ష్మస్థాయి నుంచి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. గేమ్ చేంజర్ ఈవెంట్ కోసం మంచి ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నారని, ఇది చాలా పెద్ద ప్రదేశమని, పైగా నేషనల్ హైవేకి ఆనుకుని ఉందని మంత్రి కందుల దుర్గేశ్ వివరించారు. ఇక్కడ ఎంతమందితో అయినా సభ నిర్వహించవచ్చుని, రవాణా కూడా సులభం అవుతుందని తెలిపారు. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బ్రహ్మాండమైన క్రేజ్ ఉన్న నాయకుడు. మరోవైపు గ్లోబల్ స్టార్ గా ఎదిగిన రామ్ చరణ్... వీళ్లిద్దరూ వస్తున్నప్పుడు అభిమానులు, సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, అందరి భద్రత ఏర్పాట్లకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ అంశంపై కలెక్టర్, ఎస్పీ ప్రత్యేకమైన దృష్టి పెట్టారు. ఓవైపు భద్రత, మరోవైపు కార్యక్రమం బాగా జరిగిందన్న భావన కలిగించడం... ఈ దిశగా మేం చర్యలు తీసుకుంటున్నాం.

టైమ్ కూడా మరీ పొడిగించడం కాకుండా... ఈ కార్యక్రమాన్ని సాయంత్రం 6 గంటల నుంచి 8 వరకు నిర్వహిస్తామని నిర్మాత నిన్న నాకు చెప్పారు. సమయం కుదించడం వల్ల, ఈ సభకు వచ్చినవాళ్లు తమ ఇళ్లకు సకాలంలో చేరుకునేందుకు వీలవుతుంది. మొత్తమ్మీద ఈ సభ గ్రాండ్ సక్సెస్ అవుతుందని ఆకాంక్షిస్తున్నాం" అని మంత్రి కందుల దుర్గేశ్ వివరించారు.

## అదానీతో జగన్ ఒప్పందం

# ఏపీకి చాలా లాభం

- మొదటి పేజీ తరువాయి

దీని వల్ల ఏపీకి చాలా లాభమని సీఎం చంద్రబాబు అన్నారు. అదానీపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని అన్నారు. ఈమేరకు జాతీయ మీడియాలో వచ్చిన కథనం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇదిలా ఉండగా.. సీఎం చంద్రబాబు జగన్ పై దుష్ప్రచారం చేశారని.. జాతీయ మీడియాలో వచ్చిన కథనాలే ఇందుకు నిదర్శనం వైసీపీ వర్గాలు కామెంట్ చేస్తున్నాయి.

# తమిళనాడులో ఘోర ప్రమాదం... బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

- మొదటి పేజీ తరువాయి

సాతూర్ గ్రామంలో చోటుచేసుకుంది ఘోర ప్రమాదం. పేలుడు తీవ్రతకు కార్మికుల శరీరాలు ఛిద్రమయ్యాయని, భారీ శబ్దంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయని స్థానికులు తెలిపారు. వెంటనే పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినట్లు తెలిపారు. ఫైర్ సిబ్బంది రెండు ఫైరింజన్లతో గంటల తరబడి శ్రమించి మంటలు ఆర్పివేశారు. మంటల్లో చిక్కుకున్న పలువురు కార్మికులను కాపాడి ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమేంటనే విషయం ఇంకా తెలియరాలేదని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు కోలుకున్నాక పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు.

# ఆ మూడు తేదీల్లోనే శ్రీవారిని దర్శించుకోవాలని అనుకోవద్దు

- మొదటి పేజీ తరువాయి

టోకెన్లు తీసుకోవాలన్న ఆత్రుతలో తోసుకోవద్దని సూచించారు. 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు ఉంటాయని, ఈ నెల 19 లోపు ఎప్పుడైనా శ్రీవారిని దర్శించుకోవచ్చని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. వైకుంఠ ఏకాదశి టోకెన్లు జారీ చేయనున్న కేంద్రాల్లో ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయని, ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్ష చేపడుతున్నానని వివరించారు. టీటీడీ ఈవో శ్యామలరావుతో ఏర్పాట్లపై చర్చించానని వెల్లడించారు. సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. సామాన్య భక్తులకు అనుగుణంగానే ఏర్పాట్లు చేస్తున్నామని, వీఐపీలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడంలేదని తెలిపారు.

# ప్రతి సోమవారం ఫిర్యాదులు స్వీకరిస్తాం... ఆధారాలతో రావాలి

- మొదటి పేజీ తరువాయి

సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

మరోవైపు, మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ నోటీసులు, హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా ఇక్కడ వంద అడుగుల రోడ్డును అనుకొని 5 అంతస్తుల బిల్డింగ్ అక్రమంగా నిర్మిస్తున్నట్లు హైడ్రాకు స్థానికులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అక్కడకు వెళ్లి పరిశీలించాక అక్రమ కట్టడమని తేలిందని వివరించారు. ఇది అక్రమ కట్టడమని హైకోర్టు కూడా నిర్ధారించిందని, కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ భవనాన్ని నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు పరిశీలించాక చర్యలు తీసుకుంటామన్నారు.

## వాడుక భాషలో 70 శాతం ఆంగ్లపదాలే...

# తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి

- మొదటి పేజీ తరువాయి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కొనసాగుతున్న ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... మాట్లాడటం, రాయడం ద్వారానే భాషను పరిరక్షించగలమన్నారు. పిల్లలతో నిత్యం బాలసాహిత్యం చదివించాలన్నారు. తెలుగు భాష కనుమరుగు కాకముందే రక్షించుకోవాలన్నారు. తెలుగు భాషను బోధనా భాషగా ప్రాచుర్యంలోకి తేవాలన్నారు. పాలన, అధికార వ్యవహారాలు తెలుగు భాషలో జరగాలని సూచించారు. ప్రాథమికస్థాయి వరకు విద్య కూడా తెలుగులో ఉండాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ప్రాంతీయ భాషల పరిరక్షణకు పెద్దల సహకారం అవసరమన్నారు. కోర్టుల్లో వాదనలు, ప్రతివాదనలు తెలుగులో ఉండాలని, కోర్టు తీర్పులు, సినిమాల పేర్లు తెలుగులోనే ఉండాలన్నారు. వికీపీడియాలో తెలుగు వ్యాసాలు రోజురోజుకు పెరుగుతున్నట్లు చెప్పారు. కథలు, వ్యాసాలు ఆడియోల రూపంలో అందుబాటులో ఉన్నాయన్నారు. తెలుగు భాషను డిజిటల్ విభాగంలోనూ క్రోడీకరించి భావితరాలకు అందించాలన్నారు. డిజిటల్ రంగం పరంగానూ మాతృభాష అభివృద్ధి, సంరక్షణకు దోహదం చేయాలన్నారు.

# బి.ఆర్.అంబేద్కర్ క్యాలెండర్ ఆవిష్కరణ

**పలమనేరు జనవరి 04,(పెన్ పవర్):**

నూతన సంవత్సరము సందర్భంగా అంబేద్కర్ క్యాలెండర్ ఆవిష్కరణ మరియు ఇంటింటికి క్యాలెండర్ల పంపిణీ కార్యక్రమము గంగవరం మండల పరిధిలోని కల్లుపల్లె గ్రామంలో జై భీమ్ యూత్ ఫౌండేషన్ చైర్మన్ బి.శంకర్ మరియు జిల్లా దళిత నాయకుడు సామాజిక సేవ కార్యకర్త కె.చిన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమర, బాబు,జైభీమ్ యూత్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారతరత్న అవార్డ్ గ్రహీత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ క్యాలెండర్ల పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.



పెన్ పవర్

నెల్లూరు | తిరుపతి | చిత్తూరు

# పోషక విలువలతో కూడిన ఆహారం విద్యార్థులకు అందిస్తాము

### డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం ఇంటర్ విద్యార్థులకు వరం

### మధ్యాహ్న బడి భోజనం ప్రారంభించిన ఎమ్మెల్యే







**కావలి పెన్ పవర్ జనవరి 4**

విద్యార్థులు తమ లోపాలను సరిదిద్దుకొని కష్టాన్ని ఇష్టంగా మార్చుకుంటే జీవితం సుఖమయం అవుతుందని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన కావలి నియోజకవర్గం లోని దగదర్తి, బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. స్వయంగా విద్యార్థులకు వడ్డించిన అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కాలేజీలకు విచ్చేసిన ఎమ్మెల్యే కు విద్యార్థులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. బిట్రగుంట జూనియర్ కాలేజీలో సరస్వతి దేవి విగ్రహం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కాలేజీల అకడమిక్ ప్రగతి నివేదికను ప్రిన్సిపాల్స్ వివరించారు. మత్తు పదార్థాల వలన కలిగే హాని ని విద్యార్థులు ఈ సందర్భంగా తెలియజేసారు. ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు లేనివిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నబడి భోజనం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆకలి తీర్చిన అన్నపూర్ణమ్మ మహాతల్లి డొక్కా సీతమ్మ పేరు ఈ పథకానికి పెట్టడం, ఈ పథకానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనం అని తెలిపారు. ఇది ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. కాలేజీలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, ఇది ఇంటర్ విద్యార్థులకు ఒక వరమని అన్నారు. మాది ప్రజల ప్రభుత్వమని, మంచి చేసే ప్రభుత్వమని, విద్యా వికాసం కోసం చర్యలు తీసుకునే ప్రభుత్వమని తెలిపారు. విద్యార్థుల ఆకలి తీర్చడం ఒక్కటే లక్ష్యం కాదని, రుచికరమైన, ఆరోగ్యకరమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం తమ ప్రభుత్వ బాధ్యతని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. పేదవాడు ఉన్నత స్థాయికి ఎదగాలని, పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, శారీరక దృఢత్వం, మానసిక పరిపక్వత చెందాలని యువనేత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈ పథకం రావడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాల వైపు వెళ్ళొద్దని, క్షణికానందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అని తెలిపారు. మరో 5 సంవత్సరాలు కష్టపడి చదివితే, జీవితాంతం ఆనందంగా ఉండవచ్చు అని తెలిపారు. ఈ సమయంలో కష్టపడితే జీవితం ఆనందమయం అవుతుందని, అదే ఇప్పుడు మనం సంతోషాల కోసం సమయం వృధా చేస్తే జీవితం కష్టాల పాలవుతుందని తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో కావలి గంజాయికి కేంద్రంగా ఉండేదని, ఇప్పుడు గంజాయి రహిత కావలిగా మార్పు చెందిందని, గంజాయి విక్రేతలు 40 మందికి పైగా అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. కావలి నియోజకవర్గంలో గంజాయిని కూకటి వేళ్ళతో సైతం పేకలిస్తామని తెలిపారు. దగదర్తి జూనియర్ కాలేజీకి అవసరమైన ప్రహరీగోడ, క్రీడా మైదానం చదును, ఇతర సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో బిట్రగుంట జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, దగదర్తి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సిహెచ్. ప్రకాష్ రావు, బోగోలు ఎంఈవో జయమ్మ, దగదర్తి ఎంఈవోలు భాస్కర్, విజయ రత్నం, టీడీపీ బోగోలు మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, దగదర్తి మండల టీడీపీ అధ్యక్షులు అల్లం హనుమంతరావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి ఏకాదశి పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కావలి పెన్ పవర్ జనవరి 4**

కావలి పట్టణం బృందావనం కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలకు సంబంధించిన పోస్టర్ ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆవిష్కరించారు.. శనివారం బృందావనం కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆలయ కమిటీ సభ్యులతో కలసి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనవరి 10వ తేదీ శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినమని, ఇది చాలా శుభకరమైన రోజని, విష్ణుమూర్తికి ప్రీతికరమైన రోజని తెలిపారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజున ఉపవాసం చేస్తూ, ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. బృందావనం కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తుంటారని, కార్యక్రమాలు కూడా విశేషంగా దేవస్థానం వారు చేయడం జరుగుతుందని తెలిపారు. ముక్కోటి రోజున స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఎమ్మెల్యే కోరారు.

# వేడుకగా ఎలెక్ట్రోస్టీల్ నోబుల్ స్కిల్ డెవలప్మెంట్





**శ్రీకాళహస్తి - పెన్ పవర్, జనవరి 04**

ఎలెక్ట్రోస్టీల్ తన నోబుల్ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని శనివారం వేడుకగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి పోలీస్ సూపరింటెండెంట్ ఎల్.సుబ్బారాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసిఎల్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) ప్రయత్నాలలో భాగంగా, శ్రీకాళహస్తి, చుట్టుపక్కల గ్రామాలలో కమ్యూనిటీలను బలోపేతం చేయడానికి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, 90 రోజుల వ్యవధిలో నిర్వహించబడిన బ్యూటీషియన్ కోర్సు, మహిళలకు సాధికారత కల్పించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. శ్రీకాళహస్తి వర్క్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్ ఖండేల్వాల్ మాట్లాడుతూ వారి ప్రత్యేక అవసరాలను తీర్చడం ద్వారా కమ్యూనిటీలను అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నందుకు సిఎస్ఆర్ కార్యక్రమాలపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జనరల్ మేనేజర్ దొరైరాజ్ మాట్లాడుతూ ఎలక్ట్రోస్టీల్ దాని సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా సమాజానికి తిరిగి ఇచ్చే గర్వకారణమైన సంప్రదాయాన్ని కలిగి ఉందన్నారు. సిఎస్ఆర్ శ్రీకాళహస్తి చుట్టుపక్కల ఉన్న కమ్యూనిటీల జీవనోపాధిని మెరుగుపరచడానికి అనేక కార్యక్రమాలపై దృష్టి సారించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి, వన్ టౌన్ సిఐ గోపి, టూ టౌన్ సిఐ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ రవి నాయక్, బి ఎన్ కండ్రిగ సిఐ తిమ్మయ్య, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'తెలుగు' కీర్తికి తెలుగుదేశం పార్టీ అవిరళ కృషి



**శ్రీకాళహస్తి - పెన్ పవర్, జనవరి 04**

తెలుగుజాతి ఆత్మగౌరవ పరిరక్షణ కోసం స్థాపించబడిన నాటి నుండి నేటి వరకు తెలుగుజాతి అభ్యున్నతికి, తెలుగు నేల అభివృద్ధికి, తెలుగు భాష కీర్తికి తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధితో అవిరళ కృషి చేస్తున్నదని తెలుగుదేశం పార్టీ,బిసి విభాగం నాయకులు పేర్కొన్నారు. తెలుగు భాషకు తగిన గౌరవం ఇవ్వడంలో ఎక్కడా రాజీ పడని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు జనసేనాని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషితో నిన్నటి రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు అర్థమయ్యేలా ఇకపై తెలుగులోనూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనూ, ఆంగ్లంలోనూ జారీ చేయాలని వివిధ శాఖలకు ఆదేశాలు ఇచ్చినందుకు తెలుగుజాతి యావత్తూ సంతోషం వ్యక్తం చేస్తోందని తెలిపారు. ప్రపంచదేశాలలో అత్యంత ప్రభావంతమైన సాంకేతిక నిపుణులుగా, వైద్యులుగా,వ్యాపార దిగ్గజాలుగా, పేరెన్నికగన్న బహుళజాతి సంస్థల కార్యనిర్వాహకులుగా తెలుగుజాతి ముద్దు బిడ్డలు గుర్తింపు పొందడానికి అవసరమైన అవకాశాల కల్పనకు తెలుగుదేశం పార్టీ గడచిన నాలుగు దశాబ్దాలుగా కృషి చేస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వంలో పారదర్శకత లేకుండా అసలు జీవోలు రహస్యంగా ఉంచుతూ,ఇష్టం వచ్చినట్టు దోపిడీ చేసిన సంగతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి,తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, బిసి విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు పేట బాలాజీ రెడ్డి,శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, తిరుపతి పార్లమెంటు నాయకులు బీమాల భాస్కర్, మణి, కృష్ణమూర్తి,శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా,మైనారిటీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు సయ్యద్ చాంద్ బాషా, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి అతిథి గృహంలో అపచారం

### మద్యం సేవించి యువకుల వీరంగం






**శ్రీకాళహస్తి - పెన్ పవర్, జనవరి 04**

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా నెహ్రూవీధిలో గల వరదరాజస్వామి అతిథి గృహంలో అపచారం జరిగింది. అతిథి గృహంలోని ఓ గదిలో కొందరు యువకులు శనివారం పగలు మద్యం సేవించి వీరంగం సృష్టించారు. ఈ ఘటనపై ఆలయ అధికారులు శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ అన్నదాన విభాగంలో మాధవరెడ్డి అనే వ్యక్తి పొరుగు సేవల కింద పని చేస్తున్నాడు. ఈయన సమీప బంధువు ఇటీవల చనిపోయారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కర్మక్రియలు చేశారు. ఈ కార్యక్రమం పురస్కరించుకుని మాధవరెడ్డి తన పేరున వరదరాజస్వామి అతిథి గృహంలో ఓ గది అద్దెకు తీసుకున్నాడు. ఈ గదిలో మాధవరెడ్డి కుమారుడు, ఆయన బంధువులు బస చేశారు. మాధవరెడ్డి కుమారుడు ఈ గదిలోకి మద్యం తెచ్చుకున్నాడు. తన స్నేహితులతో కలసి గదిలోనే మద్యం సేవించాడు. ఇది గమనించిన అతిథి గృహం సిబ్బంది అతనిని నిలదీశారు. దీంతో అతడు వారిపై దౌర్జన్యానికి దిగాడు. ఈ విషయమై ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన తీవ్రంగా స్పందించారు. మద్యం సేవించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మద్యం సేవించిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా వరదుని అతిథి గృహంలో మద్యం సేవించిన ఘటన శ్రీకాళహస్తిలో చర్చనీయాంశంగా మారింది.

# ఘనంగా అంతర్జాతీయ అంధుల దినోత్సవం

**పలమనేరు జనవరి 04,(పెన్ పవర్):**

ప్రభుత్వ సమగ్రశిక్ష ఆదేశాల మేరకు పలమనేరు మండలం విద్యావనరుల భవిత కేంద్రం నందు మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి,బాలసుందరం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అంధుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ జన్మదినాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయ అందుల దినోత్సవం జనవరి 4వ తేది జరుపుకుంటారని ఇతను అంధుల స్పర్శ జ్ఞానంతో చదివేందుకు, రాసేందుకు ఒక లిపిని తయారు చేశారన్నారు. ఇతను రూపొందించిన లిపి బాగా ప్రాచుర్యం పొందడంతో ఈ లిపి కి బ్రెయిలీ లిపిగా పేరు వచ్చిందని,దీనికి కారణం ఇతడు కూడా ఒక అంధుడే మూడేళ్ల వయసులోనే కంటిచూపు కోల్పోయాడని, కనిపెట్టిన బ్రెయిలీ లిపి సహాయంతో బాగా చదువుకొని తాను చదువుకున్న పాఠశాలలో అంధుల టీచర్ గా గుర్తింపు పొందాడన్నారు. అంతటి ఆయనను మనమందరం ఆదర్శం తీసుకోవాలని చెప్పారు. అనంతరం బాలసుందరం మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా అందులు సైతం విద్యద్వారా సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఏకైక లక్ష్యంతో అంధుల కొరకు బ్రెయిలీ లిపిని కనిపెట్టాడని, ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మంది అంధుల జీవితాల్లో అక్షరజ్ఞానం కలిగించిన మహనీయుడని కొనయాడాడు. అధికారులతో పాటు సహిత విద్య ఉపాధ్యాయులు మంగేశ్వరి,మురళి, విద్యానగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతీ, సిఆర్పి. గీత తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమంకి 25 బియ్యం బస్తాలు వితరణ చేసిన జనసేన ఇంఛార్జి వినుత కోటా






**శ్రీ కాళహస్తి - పెన్ పవర్, జనవరి 04**

శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోట ఆధ్వర్యంలో ప్రతి గురువారం శ్రీకాళహస్తి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం గత 24 వారాలుగా నిర్వహిస్తున్నారు. శనివారం నాడు 25 వ వారం కావడంతో వినుత కోటా 25 బియ్యం బస్తాలు డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వహణ సమన్వయకర్తలు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి గార్లకి వితరణ చేసారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానం 500 మందికి పైగా చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో డొక్కా సీతమ్మ స్ఫూర్తితో శ్రీకాళహస్తిలో ప్రతి వారం అన్నదానం నిర్వహించడం సంతోషంగా ఉందని ఈ 25 వారాల్లో వేలమంది పేదల ఆకలి తీర్చడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు పేట చంద్ర శేఖర్, కావలి శివకుమార్, తోట గణేష్, భాగ్య లక్ష్మి ,పేట చిరంజీవి, రవి కుమార్ రెడ్డి, కవిత , బాలాజీ, నితీష్, వెంకటరమణ , దుమ్ము రాయల్ , శారద, గాయత్రి, సురేష్, శీను, తేజ , దినేష్, మని తదితరులు పాల్గొన్నారు.

## దొనకొండ జిల్లా పరిషత్ హై స్కూల్లో ఆల్ ఇన్ వన్ బుక్స్ పంపిణీ చేసిన బూచేపల్లి కుటుంబం





**దొనకొండ జనవరి04 పెన్ పవర్**

మండలం కేంద్రంలో ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ అయినటువంటి రామాంజనేయులు అధ్యక్షతన ఈరోజు అనగా 04.01.2025 సుమారు మధ్యాహ్నము 03:15 గంటల ప్రాంతంలో ప్రకాశం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ దర్శి ఎమ్మెల్యే ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వైసీపీ కార్యకర్తలు సుమారు 150 మంది దాకా పాల్గొన్నారు. మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వివిధ తరగతుల విద్యార్థులు సుమారు 450 మంది దాకా పాల్గొన్నారు. ఈ కార్యక్రమము మధ్యాహ్నం 03:15 గంటల నుండి 04:00 గంటలకు ముగిసినది.

## సర్వేనెంబర్ 329/2 అక్రమనణలు తొలగించిన దేవాదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి శ్రీ గిరి రాజు నరసింహ బాబు




**పెన్ పవర్ పామూరు జనవరి 04**

పట్టణంలోని శ్రీ మదన వేణుగోపాలస్వామి మరియు వల్లి భుజంగేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన నెల్లూరు రోడ్ లో గల సర్వేనెంబర్ 329/2 ఆక్రమణలు తొలగించిన దేవాదాయ శాఖ కార్య నిర్వాహ అధికారి శ్రీ గిరిరాజు నరసింహ బాబు . ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ బండ్ల నారాయణ , దేవాదాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్ధవీడు ఎస్ఐ హెచ్చరికలు

**అర్ధవీడు, పెన్ పవర్ , డిశంబర్ 4**

అర్ధవీడు మండల పరిసర ప్రాంత ప్రజలకు ఎస్ఐ సుదర్శన్ యాదవ్ శనివారం కీలక సూచనలు జారీ చేశారు. బైక్పై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. అలాగే మండల పరిధిలో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గ్రామం పై నిఘా ఉంచామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని అన్నారు.



## జ్యూరిస్ప్రుడెన్స్ అంశంపై ఇంటరాక్టివ్ సెషన్




**తిరుపతి పెన్ పవర్ జనవరి 04**

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయము న్యాయశాస్త్రం విభాగం లో గ్లోబలైజేషన్ యాస్ ఎ ఫాక్టర్ ఆఫ్ జనరల్ జ్యూరిస్ప్రుడెన్స్ అంశంపై బుధవారం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీగౌరి సవేత స్కూల్ ఆఫ్ లా, సవేత యూనివర్శిటీ, చెన్నై, ఎల్ఎల్.బి. ఎల్ఎల్ఎమ్ విద్యార్థినీలు మరియు రిసెర్చ్ స్కాలర్స్ ను ఉద్దేసించి మాట్లాడారు. గ్లోబలైజేషన్ యాస్ ఎ ఫాక్టర్ ఆఫ్ జ్యూరిస్ప్రుడెన్స్ అనే అంశంపై మాట్లాడుతూ జ్యూరిస్ప్రుడెన్స్ అంటే 'నాలెడ్జ్ ఆఫ్ లా' అని, ఇది "జ్యూరిస్ప్రుడెన్షియా" అనే లాటిన్ పదం నుండి వచ్చిందని, గ్లోబలైజేషన్ రోజురోజుకి దాని ప్రాముఖ్యతను సంతరించుకుంటూందని, ఆతరుణంలో జ్యూరిస్ప్రుడెన్స్ కూడా అడాప్ట్ చేసుకుంటూ న్యాయసవాళ్లను ఎదుర్కుంటూ ముందుకు పోవాలని, విజయవంతమైన న్యాయవాదిగా లేదా న్యాయమూర్తిగా మారడానికి న్యాయపరమైన నేపథ్యం అవసరమని డాక్టర్ శ్రీగౌరి తెలిపారు. న్యాయశాస్త్ర విభాగాధిపతి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్పర్సన్ డాక్టర్ మాధురి పరదేశి మాట్లాడుతూ "లా" ప్రాముఖ్యతను తెలియజేసారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సీతాకుమారి డాక్టర్ శ్రీగౌరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవిభాగ అధ్యాపకులు ప్రొఫెసర్ సీతాకుమారి, డాక్టర్ మాధురి, డాక్టర్ సునీత, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, న్యాయవిద్యార్థినీలు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

## పన్ను బకాయిలు త్వరగా పూర్తి చేయాలి...

**విధులలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలకు వెనుకాడ బోము**
**మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డి ఎస్ హరికృష్ణ.**




**చిలకలూరిపేట పెన్ పవర్ ప్రతినిధి 04**

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ఆర్డీ ఎస్ హరికృష్ణ . అనంతరం పన్ను వసూళ్ల పై రెవెన్యూ అడ్మిన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో పన్నులు పాతబకాయలు ఎంత శాతం పూర్తయిందని వివరాలు అడిగి తెలుసుకున్నారు.పన్నుల ఆదాయం 100% శాతం పూర్తిచేయాలని,ప్రతి ఒక్కరు పూర్తి బకాయిలు కట్టే విధంగా చూడాలని, ప్రతి సచివాలయ అడ్మిన్ తమ పరిధిలో ఉన్న పన్ను బకాయి వసూళ్లు త్వరలో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు, విధులలో ఎవరైనా అలసత్వం వహించిన,బాధ్యత రాహిత్యాంగా వ్యవహరించిన శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పతి శ్రీ హరిబాబు,రెవెన్యూ ఆఫీసర్ సుబ్బారావు,రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు ఖాదర్,గిరి బాబు అడ్మిన్లు ఉన్నారు.

## ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలను సాధించాలి

**- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**పెన్ పవర్, జనవరి 4, అద్దంకి**

కష్టమైన ఇష్టంతో చదివినట్లయితే మంచి ఫలితాలను సాధించవచ్చు అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం నియోజకవర్గంలోని సంతమాగులూరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో కార్యక్రమంలో భాగంగా మంత్రి గొట్టిపాటి రవి ప్రారంభించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి లోకేశ్ ఈ పథకాన్ని ముందుకు తీసుకొచ్చారని ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఇచ్చినమాట నిలబెట్టుకోవడానికే కూటమి ప్రభుత్వం మొదటి గా ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి గొట్టిపాటి రవి తెలిపారు. విద్యార్థులకు మంచి విద్యాబోధనలో అందించి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్పొరేట్ కాలేజీలకు ఏమాత్రం తీసుకోకుండా మంచి విద్య బోధనలో అందించే విధంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంపీపీ ఏనుబర్ల ఎల్లమంద, ఎంఈఓవేమవరపు కోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులు,స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## దాతల సాయంతో అంబేద్కర్ గురుకుల పాఠశాలకు జారుడుబండ




**పలమనేరు జనవరి 04,(పెన్ పవర్):**

పలమనేరు పట్టణంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శనివారం జారుడుబండను శ్రీపురం సునీత చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ జారుడుబండను పలమనేరు శ్రీపురం సీతారామయ్య నాగమణి చారిటబుల్ ట్రస్ట్ మరియు రూరల్ పరిధిలోని కొలమాసనపల్లి ఆయుర్వేద హాస్పిటల్ యాజమాన్యం గంగిరెడ్డిరత్నారెడ్డిల భాగస్వామ్యంతో అందించామని దాతలు తెలిపారు. ఇందులో పాఠశాల విద్యార్థులతో బాటు దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పూర్వ బాల్య సంరక్షణ మరియు విద్య దినోత్సవం వేడుకలు




**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 4**

కనిగిరి మండల పరిధిలోని కంచర్లవారిపల్లి అంగన్వాడీ కేంద్రంలో శనివారం" పూర్వ బాల్య సంరక్షణ మరియు విద్య దినోత్సవం" అంగన్వాడి టీచర్ పి కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి పాల్గొన్నారు . ఈసందర్భంగా విద్యార్థులకు ఆటలతో సంఖ్యా జ్ఞానాన్ని తెలుసుకోవడం, అంకెలతో అభినయ గేయాలు చెప్పడం, మార్కెట్ కు వెళ్లి కూరగాయలు అమ్మడం, కొనడం రోల్ ప్లే  తల్లిదండ్రుల ఎదుట ప్రదర్శించారు. సృజనాత్మకత కోసం తల్లిదండ్రులకు స్థానిక కథలు చెప్పడం, అభినయ గేయాలు ప్రదర్శించడ మైనది. ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను ఎలా నేర్చుకుంటున్నామో విద్యార్థులు చేసి చూపించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ప్రదర్శించబడిన బోధన పరికరాలు, ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను పి, పి, 1.పి, పి, 2 పుస్తకాలతో ఎలా బోధిస్తున్నారో మీరు చూశారని అన్నారు. గ్రామంలోని పిల్లలు అందరిని అంగన్వాడీ కేంద్రాలకు పంపి విద్యను పొందేలా చూడాలన్నారు. విద్య ద్వారానే మీపిల్లల బంగారు బాల్యం ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మేరీ, అంగన్వాడీ టీచర్లు శైలజ ,రమణమ్మ ,ధనలక్ష్మి, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

# వికలాంగుల విద్యార్థిని విద్యార్థులకు చేయూత



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 4**

స్ఫూర్తి ఎడ్యుకేషనల్ విద్యార్థినీ, విద్యార్థుల పాఠశాలలో గిద్దలూరుకు చెందిన కంటి వైద్య నిపుణులు, ప్రకాశం జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్. జి. కే .మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా వికలాంగుల విద్యార్థిని, విద్యార్థులకు పండ్లు, వారి ఆహారానికి సంబంధించి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరికి అనారోగ్య సమస్యలు కలిగినప్పుడు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఇదేవిధంగా సమాజంలోని వ్యక్తులు తమకు వీలైనంతవరకు సహాయము చేయాలని కోరారు .పాఠశాల ప్రిన్సిపల్ ఈ. గోపాల్ రెడ్డి , ఆసుపత్రి వైద్య సిబ్బంది, పీరయ్య, లింగేష్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యం

**- నేడు టాలెంట్ టెస్ట్**

**- డి జె ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు దామచర్ల అనిషా లక్ష్మి, దామచర్ల తనూజ లక్ష్మి వెల్లడి**



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 04**

డి జె ఆర్ ట్రస్ట్ ద్వారా నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యమని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు కుమార్తెలు దామచర్ల అనిషా లక్ష్మి, దామచర్ల తనూజ లక్ష్మి వెల్లడించారు. డి జె ఆర్ ట్రస్ట్ ఆద్వర్యంలో ఆదివారం ఉదయం 9.30 లకు ఒంగోలులోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో నిర్వహించే టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. 5 వ తరగతి విద్యార్థులు ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకుని తమ పేర్లు నమోదు చేసుకోవాలని పెన్ను రైటింగ్ ప్యాడ్ వెంట తెచ్చుకోవాలని కోరారు. టాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపికైన విద్యార్థుల్లకు 6 నుండి 10 వ తరగతి వరకు వారు చదివే పాఠశాలల పూర్తి ఫీజులను డి జె ఆర్ ట్రస్ట్ భరిస్తుందని, ఉచిత విద్యా సామాగ్రిని అంద చేస్తుందని వివరించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి భవిష్యత్ ను మెరుగుపరచడమే డిజేఆర్ ట్రస్ట్ లక్ష్యమని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## హరిహర క్షేత్రంలో వైభవంగా గోవింద

# కలశాభిషేకాల వేడుక

**- స్వామి వారి గంగాజల అభిషేక సేవలో పాల్గొన్న మాజీమంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మి పద్మావతి దంపతులు**

**- కలశాలతో వేలాదిగా తరలి వచ్చిన భక్తజన సందోహంతో తరించిన హరిహర క్షేత్రం**

**- గోవింద నామ స్మరణతో వైకుంఠం తలపించిన శ్రీ హరిహర క్షేత్రం**







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 04**

శ్రీ హరిహర క్షేత్రంలో ఏటా ఆనవాయితీగా చీమకుర్తి గోవింద భక్త జన బృందం సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించే గోవింద; కళాశాభిషేకాలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చీమకుర్తి ఇసుకవాగు కృష్ణ మందిరము నుండి; మహిళలు 516 కళశాలతో పవిత్రమైన గంగా జలంతో శ్రీ హరిహర క్షేత్రంలో వరకు ఊరేగింపుగా; తరలి వచ్చారు. గోవింద భక్త జన బృందం అద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చీమకుర్తి కి చెందిన మహిళా భక్తులు, చిన్నారులు, గోవింద మాలా దారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు వారి కుటుంబ సభ్యులు క్షేత్రములో వేంచేసి స్వామి వార్లకు; విశేష పూజలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు వెంకట హరి కుమారా చార్యులు, టీటీడీ వేద పండితులు ఆధ్వర్యంలో ప్రాతఃకాలంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశ్వక్సేనా ఆరాధన,మహా మండపా రాధన, సభాప్రార్ధన, కలశ స్థాపన,పుణ్యాహవ చనం, మహా సుదర్శన యాగం, ధన్వంతరి హోమం, లక్ష్మీ నరసింహ యాగం,ఉప కళశా రాధన,ప్రధాన కళశారాధన ఘనంగా నిర్వహించారు.






ఉభయదాతలు ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి దిగ్విజయంగా నిర్వహించారు. తదుపరి మహిళలు తెచ్చిన కలశాలతో స్వామి వారీ అభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మహిళలు కలశాలు తో విచ్చేసి స్వామి వారికి అభిషేకం నిర్వహించడాని బారులు తీరారు.కలశాలతో వచ్చిన మహిళల గోవింద నామ స్మరణతో శ్రీ హరిహర క్షేత్రం తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధి తలపించింది.

అభిషేకాలు అనంతరం స్వామి వారికి ఏడాదికి ఒక్క సారి నిర్వహించే చందన అలంకరణ నిర్వహించారు చందన అలంకరణతో శ్రీవారి దివ్య దర్శనం తిలకించిన భక్తులు గోవిందా గోవిందా నామాలు జపిస్తూ భక్తి పారవశ్యంతో పరవశించారు.అనంతరం మాజీమంత్రి శిద్దా రాఘవరావు, శ్రీవారికి విశేష పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించి స్వామి వారి ఆశీసులు అందుకున్నారు. ఆలయ అర్చకులు శిద్దా రాఘవరావు దంపతులకు వేద ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు అందచేశారు.శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు, వాహన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు శ్రీమాన్ వెంకట హరి; కుమరా చార్యులు,సుబ్రహ్మణ్యం శర్మ,హరికృష్ణ శర్మ,; భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకలలో మాజీ ఏ.ఎమ్.సి. చైర్మన్ మారం వెంకా రెడ్డి,చలువాది బదరి నారాయణ,నూనె సుబ్రహ్మణ్యం,సోమా శ్రీనివాసరావు గురు గోవింద, పిల్లి రామ కృష్ణ, చింత గింజల శ్రీనివాసరావు, గుంజి సుబ్బారావు, కోట రామారావు, కె. మాధవ, చల్లా వెంకట్రావు, కుడాల గోపి,రంగు ప్రసాద్, తన్నీరు ఆంజనేయులు, గోవింద భక్త బృందం, గోవింద స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**వైభవంగా నగరోత్సవం...:** గోవింద భక్త బృందం అధ్వర్యంలో సాయంత్రము శ్రీ హరిహర క్షేత్రం నుండి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నగరోత్సవం కమనీయంగా సాగింది.గోవింద నామాలతో స్వాములు శ్రీవారిని చీమకుర్తి నగర వీధుల్లో నగరొత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.మంగళ వాయిద్యాలు,గోవింద స్వామి భక్తిపాటలతో చీమకుర్తి నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నారులు జ్యోతుల ప్రదర్శన; ఆకట్టుకుంది.

# ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

**- ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని**

**- ఒంగోలులో ప్రారంభించిన శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు**




**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 04**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఛదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించడం అభినందనీయమని ఒంగోలు శాసన సభ్యులు.. టి డి పి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ పేర్కొన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఒంగోలులో ప్రారంభించిన దామచర్ల జనార్దన్ ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. జనార్ధన్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత అయిదేళ్ల అస్తవ్యస్త పాలనలో దెబ్బతిన్న ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు విద్య, ఐటిశాఖల మంత్రి నారా లోకేష్ నిర్మాణాత్మక చర్యలకు శ్రీకారం చుట్టారని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, ఫలితాల మెరుగుదలకు పలు చర్యలు చేపట్టారని ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1,48,419 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారని వెల్లడించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఈ ఏడాది రూ. 27.39 కోట్లు. వచ్చే విద్యాసంవత్సరంలో రూ. 85.84 కోట్లు ఖర్చుచేయనున్నారని వివరించారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థుల ఆకలి తీర్చడంతో పాటు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, విద్యపై ఆసక్తిని పెంపొందించడం కోసం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం ముఖ్యముగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.పేద విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టడమే కాకుండా ఆరోగ్య సమస్యలు, ఆకలి సమస్యలను తగ్గించడానికి, చదువులో వెనుకబడిపోకుండా ఉండేందుకు విద్యార్థులు చదువులో మరింత పురోగతి సాధించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# పల్లెపండుగ పనులను పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా**





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 04**

పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను అత్యంత వేగంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఈ పనుల పురోగతిపై శనివారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. చేసిన పనులకు బిల్లులను ప్రభుత్వం తక్షణమే చెల్లిస్తున్నందున పనులను ముమ్మరం చేసి బిల్లులను అప్లోడ్ చేయాలని చెప్పారు. జిల్లాకు కేటాయించిన పనులు. వాటి పురోగతిపై నియోజకవర్గాల వారీగా ఆమె ఆరాతీశారు. ఈ పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు పురోగతిని సమీక్షిస్తున్నారని ఆమె తెలిపారు. ఒంగోలు, సంతనూతలపాడు, దర్శి, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాలలో ఈ రోడ్ల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు మరింత దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పనులను చేపట్టడంలో ఎక్కడైనా రెవెన్యూ పరంగా సమస్యలు తలెత్తితే స్థానిక తహశీల్దార్ సమన్వయం చేసుకోవాలని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో డ్వామా పి.డి. జోసఫ్ కుమార్, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. (ఇన్చార్జ్) జి.బ్రహ్మయ్య, పంచాయతీరాజ్ ఈ.ఈ., డి.ఈ.ఈ.లు. ఏ.ఈ.ఈ.లు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పోలీసు అభ్యర్థులఎంపిక ప్రక్రియ

## - జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

### 5 వ రోజు కొనసాగిన కానిస్టేబుల్ మహిళ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 04**

ఏపీ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు సూచించిన నియమాల ప్రకారం ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లుగా జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. పోలీస్ నియామక ప్రక్రియలో భాగం గా మహిళ కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అరత సాధించిన జిల్లాలోని అభ్యర్థులకు శనివారం ఉదయం 5 గంటల నుండి ఒంగోలు పోలీసు కవాతు మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు (పీఎంటీ, పీఈటీ) పరీక్షలు నిర్వహించారు. ఐదవ రోజు 455 మంది మహిళ అభ్యర్థులకు గాను 221 మంది హాజరయ్యి పాల్గొనగా, వీరిలో 114 మంది తదుపరి వ్రాత పరీక్షకు అరత సాధించారు.

**జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...:** పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో, పారదర్శకంగా సీసీ కెమెరాల నిఘాలో, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, సాంకేతిక నిపుణుల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. మొదట మహిళ అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలించాక బయోమెట్రిక్స్, ఫిజికల్ మెజర్మెంట్స్ తీసుకుంటారని, పరీక్షలలో భాగం గా 1600మీటర్లు, 100మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించమని, ఎటువంటి పొర పాట్లకు తావులేకుండా ఆధునిక ఆర్ఎఫ్ఐడీ కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దేహడారుఢ్య పరీక్షలకు అభ్యర్తులు వెరిఫికేషన కోసం ఒరిజినల్ ధ్రువపత్రాలతో రావాలన్నారు. అభ్యర్థుల కొరకు వైద్య శిబిరం, మంచినీరుతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. డబ్బు చెల్లిస్తే ఉద్యోగం ఇస్తామని నమ్మబలికే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, కానిస్టేబుల్ ఉద్యోగం కేవలం ప్రతిభ, సామర్థ్యం ఆధారంగా మాత్రమే లభిస్తుందని, దేహదారుఢ్య పరీక్ష ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మ బలికితే అలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు తెలియచేయాలని విజ్ఞప్తి చేశారు. కానిస్టేబుల్ అభ్యర్థులందరికీ మనవి శారీరక దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వారి యొక్క ఆరోగ్య స్థితిగతులను ఆధారంగా చేసుకుని టెస్టులకు హాజరవ్వాలని,అలాగే ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండాలి. ఈ ఈవెంట్స్ లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, పిటిసి డిఎస్పీ మాధవ రెడ్డి, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరరావు, పిటిసి డిఎస్పీ లక్ష్మణ్ కుమార్, డీపీఓ ఏఓ రామ్మోహన్ రావు, ఐటి కోర్ సీఐ వి. సూర్యనారాయణ, ఆర్ఐ లు, డీపీఓ సిబ్బంది,మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రబీ సీజన్లో ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలి

### రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సూచన -జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు



**బెస్తవారిపేట, పెన్ పవర్ జనవరి 4:**

బేస్తవారిపేట మండలంలోని సలకలవీడు శంకర్ రెడ్డి ఫార్మసీ కాలేజీ లో గిద్దలూరు మరియు మార్కాపురం సబ్ డివిజన్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గిద్దలూరు మరియు మార్కాపురం సబ్ డివిజన్లోని రైతు సేవ కేంద్రాల సిబ్బందిని ఉద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం రబీ 2024 సీజన్ కు సంబంధించి ఈ పంట నమోదు త్వరగా పూర్తిచేయాలని, ఎన్ పి ఎస్ ఎస్ యాప్ నందు క్షేత్రస్థాయిలో పైర్లలో ఆశించిన చీడపీడలను ఫోటో తీసిన యెడల వాటికి సంబంధించిన నివారణ చర్యలను తెలియజేయటం జరుగుతుందని ఈ యాప్ గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయాలని తెలియజేసినారు.కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ వివిధ పంటల్లో వచ్చు చీడపీడలు గురించి వాటి నివారణ చర్యల గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ముఖ్యముగా శనగపైరులో శనగ పచ్చ పురుగు నివారణకు నివారణకు ఇమామెట్టిన్ బెంజోయేట్ 100గ్రామ్స్ ఒక ఎకరాకు వాడి సమర్థవంతంగా నివారించవచ్చునని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీనివాస నాయక్ , గిద్దలూరు మరియు మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు డి బాలాజీ నాయక్, గిద్దలూరు మరియు మార్కాపురం సబ్ డివిజన్లోని మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎంపీఈవోలు మరియు రైతు సేవ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

# బోనేని వెంకటేశ్వర్లు యాదవ్‌కు గిద్దలూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ పదవి కల్పించాలి

**మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవికి అనుభవం, అరత గల నాయకుడు బోనేని.**

**గిద్దలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేసిన నాయకుడు.**

**నియోజకవర్గంలోని రైతులు, వ్యాపారస్తులు ,అన్ని వర్గాల ప్రజలతో మంచి స్నేహ సంబంధాలు కలిగిన నేత.**

**అధికారం కోల్పోయి పార్టీ కష్టాల్లో ఉన్న రోజుల్లో పార్టీ ఆదేశాలను పాటిస్తూ, వైసిపి ప్రజావ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించిన వెంకటేశ్వర్లు యాదవ్.**

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విధేయనిగా, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కి నమ్మిన బంటుగా వ్యవహరిస్తున్న బోనేని.**



**కొమరోలు పెన్ పవర్ జనవరి 4**

కొమరోలు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్కు గిద్దలూరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ పదవి కల్పించాలని కొమరోలు మండలంలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కోరుతున్నారు. గత దశాబ్దల కాలంగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక సభ్యునిగా పనిచేస్తూ కొమరోలు మండల అధ్యక్షునిగా పదవి చేపట్టి పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా నిబద్ధతగల కార్యకర్తా పనిచేస్తున్న బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ మార్కెట్ యార్డ్ కమిటీ అధ్యక్ష పదవికి అన్ని విధాల అర్హుడని వారు చెబుతున్నారు. గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలలో కూడా రైతులు, వ్యాపారస్తులు, యువత అన్ని వర్గాల ప్రజలందరితో మంచి స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్న నాయకుడని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రస్థానం మొదలైనప్పటి నుంచి సాధారణ కార్యకర్తగా పార్టీలో చేరి నాయకుని స్థాయి ఎదిగి పార్టీకి విశేష సేవలు అందిస్తూ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు విధేయుడుగా, ప్రస్తుత గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల సంజీవరెడ్డికి గత పది సంవత్సరాలుగా నమ్మిన బంటుగా పనిచేస్తూ పార్టీ పిలుపు మేరకు అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చారని ,అప్పటి వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ అనేగా కార్యక్రమాలు నిర్వహించారని చెబుతున్నారు. పార్టీకి ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్న వెంకటేశ్వర్లు యాదవ్ కు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి కల్పించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని టిడిపి నేతలు కార్యకర్తలు తెలిపారు. తాను స్వతహాగా అమ్మ ఫౌండేషన్ను స్థాపించి తన సొంత నిధులతో జిల్లా, రాష్ట్రస్థాయిలో పేద, నిరుపేదలు వృద్ధులు వికలాంగులు పేద విద్యార్థులు తదితర ఆపదలో ఉన్న వారందరికీ ఆపన్న హస్తం అందిస్తూ అమ్మ ఫౌండేషన్కు మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంటూనే, తెలుగుదేశం పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసిన నాయకుడు అన్నారు .సామాజిక పరంగా, పార్టీపరంగా ,వర్గాలపరంగా ఏ కోణంలో చూసినా గిద్దలూరు మార్కెట్ యార్డు పదవి చైర్మన్ పదవికి బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ అన్ని విధాల అర్హుడని కావున బోనెని వెంకటేశ్వర్లు యాదవ్ కు గిద్దలూరు మార్కెట్ యార్డు పదవి కల్పించాలని కొమరోలు మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కి విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఉద్యోగుల సమాఖ్య క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంపీడీవో



**పొదిలి, పెన్ పవర్ జనవరి 4**

మాదిగ ఉద్యోగుల సమాఖ్య క్యాలెండర్ ను మండల కేంద్రమైన మర్రిపూడి లో శనివారం నాడు ఎంపీడీవో జగదీష్ ఆవిష్కరించారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎంపీడీవో జగదీష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు ఐక్యతగా ఉండటం అభినందనీయమన్నారు ఈ కార్యక్రమంలో కొండేపి మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు కిషోర్ కుమార్, మర్రిపూడి మండల ఎం ఆర్ పి ఎస్ అధ్యక్షులు ఎం బసవయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చప్పిడి కుటుంబాన్ని పరామర్శించిన బెల్లంకొండ విద్యాసంస్థల అధినేతలు





**పొదిలి, పెన్ పవర్ జనవరి 4**

ఇటీవల గుండెపోటుతో మరణించిన పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, చిన మన గుండం మాజీ సర్పంచ్ చప్పిడి రామలింగయ్య కుటుంబాన్ని శనివారం నాడు బెల్లంకొండ విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు పరామర్శించారు ఈ సందర్భంగా దివంగత నేత రామలింగయ్య సతీమణి ఆదిలక్ష్మి, వారి పిల్లలను పరామర్శించి, ఓదార్చారు చప్పిడి రామలింగయ్య తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి చేసిన సేవలు, అలాగే ఆయన తన పదవులు ద్వారా ప్రజలకు చేసిన మేలును ఈ సందర్భంగా శ్రీనివాసరావు, విజయలక్ష్మి లు గుర్తు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో బెల్లంకొండ విద్యాసంస్థల అధినేతలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పొదిలిలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం





**పొదిలి, పెన్ పవర్ జనవరి 4**

పొదిలి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం నాడు ప్రారంభించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఇటువంటి నిర్ణయం ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు ఇటువంటి చక్కటి నిర్ణయం తీసుకున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను పలువురు ప్రశంసించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాసరెడ్డి, మండల తెలుగుదేశం నాయకులు కాటూరి నారాయణ ప్రతాప్, ముల్లా కుద్దూస్, ఎండి గౌస్, ఎస్ మౌలాలి, వీరి శెట్టి సురేష్, షేక్ జిలాని భాష, ఎస్ రబ్బాని ముల్లా గౌస్, మహిళా నాయకురాలు షేక్ మెహర్ ఉన్నిసా, సానిటరీ ఇన్స్పెక్టర్ మారుతి రావు తోపాటు పలువురు దేశం నాయకులు, అధికారులు, కళాశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చయ్య మృతదేహానికి నివాళులర్పించిన ఎరీక్షన్ బాబు



**పుల్లల చెరువు పెన్ పవర్ జనవరి 4**

తీవ్ర అనారోగ్యం కారణంగా పుల్లలచెరువు టిడిపి నాయకులు పసుపులేటి పిచ్చయ్య శనివారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు అక్కడ్నుంచి పుల్లలచెరువు తీసుకొనిరాగా శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు.విషయం తెలుసుకున్న ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరు ఎరీక్షన్ బాబు శనివారం మధ్యాహ్నం మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు.పలువురు ప్రజా ప్రతినిధులు,టీడీపీ నాయకులు పిచ్చయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## దొడ్డవరం తెల్లబాడు నీటి సమస్యను పరిష్కరించిన ఆంజనేయులు





**మద్దిపాడు మండలం పెన్ పవర్ జనవరి 4**

మద్దిపాడు మండలం దొడ్డవరం తెల్లబాడు ఈ రెండు గ్రామాలు ఒకటే పంచాయతీలో ఉన్నాయి అయితే గత వారం రోజులుగా నీటి సమస్యతో బాగా ఇబ్బందులు పడుతున్నారు కనీసం తాగటానికి కూడా నీరు లేని పరిస్థితి ఇలాంటి సమయంలో దొడ్డవరం తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నేనున్నానంటూ ఒక్కడే నీటి సమస్యకు గురైన మోటర్ ను తన సొంత ఖర్చులతో కొత్త మోటర్ ను తెప్పించి సమస్యను పరిష్కరించి రెండు గ్రామాలకు నీరు వచ్చేలా శాశ్వత పరిష్కారాన్ని తెచ్చారు రెండు గ్రామాల ప్రజలు అతనికి కృతజ్ఞతలు తెలియజేస్తూ చేతగాని గ్రామ సర్పంచిని ఎన్నుకున్నామని ఇప్పుడు బాధపడుతున్నామని గ్రామంలో ఇన్ని సమస్యలు ఉన్న గ్రామం వైపే చూడట్లేదని రెండు గ్రామాల ప్రజలు సర్పంచ్ పై ద్వేషంతో మండిపోతున్నారు త్వరలో జరగబోయే సొసైటీ ఎలక్షన్లో చైర్మన్ పదవి రేసులో నిడదల ఆంజనేయులు ఉన్నట్టుగా సమాచారం తెలుస్తుందని గ్రామ ప్రజలు అంటున్నారు ఇలాంటి వ్యక్తిని సొసైటీ చైర్మన్ గా ఎన్నుకోనీ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని అధికారులను రెండు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎర్త్...ఎవరికి... బెర్త్... ఎవరికి

**విజయవాడ, జనవరి 4, పెన్ పవర్::** రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలల పాలనను పూర్తి చేసుకుంది. ఇంకా ఏడాది కూడా కాలేదు. అయితే అప్పుడే రాష్ట్రంలోని మంత్రులను మార్చుతారా? కొంతమందికి ఉద్వాసనం పలికి, కొత్తవారికి అవకాశం ఇస్తారని చర్చ రాష్ట్రంలో ఊపందుకుంది.ఇదే విషయంపై ఇటు కూటమి పార్టీల్లోనూ, అటు ప్రజల్లోనూ విస్తృత చర్చ జరుగుతోంది. దీంతో కూటమి ప్రభుత్వంలోని ప్రధానంగా టీడీపీ మంత్రుల్లో కొంతమందికి గుండెల్లో భయం మొదలైంది. తమ పోస్టు ఉంటుందో, ఊడుతోందని అభద్రతా భావంలో ఉన్నారు. అయితే రాష్ట్రంలో మంత్రులను మార్చుతారనే చర్చ మంత్రి పదువుల ఆశావహులకు మాత్రం సంతోషాన్ని కలిగిస్తోంది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి పట్టుమని పది నెలలు కాకుండానే ఈ చర్చ తెరపైకి వచ్చింది. అయితే దీనికి కొన్ని కారణాలు లేకపోలేదు. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మలరామానాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు పనితీరు బాగానే ఉన్నప్పటికీ? కొంత మంది మంత్రులు పనితీరు సరిగ్గా లేదని చర్చ జరుగుతోంది.కొంత మంది మంత్రులను వివాదాలు కూడా వెంటాడుతున్నాయి. విజయనగరం జిల్లాకు చెందిన గజపతినగరం ఎమ్మెల్యే, పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కోనసీమ జిల్లాకు చెందిన రామచంద్రాపురం ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కృష్ణా జిల్లాకు చెందిన నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వంటి వారిని ఇటీవలే వివాదాల చుట్టుముట్టాయి. అన్నమయ్య జిల్లాకు చెందిన రాయచోటి ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వంటి వారు కూడా గతంలో వివాదాలకు కేంద్రం అయ్యారు. దీంతో రాష్ట్రంలో మంత్రుల మార్పు జరుగుతోందని చర్చ జరుగుతోంది.రాష్ట్ర మంత్రివర్గం 26 మందితో ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా 25 మందితో మంత్రి వర్గం ఉంది. ఒక స్థానం ఖాళీగా ఉంది. అది జనసేన స్థానం. దాన్ని జనసేన నేత నాగబాబుతో భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరుగుతోందని చర్చ జరుగుతోంది.ఈ మంత్రి వర్గ విస్తరణలోనే కొంత మందికి మంత్రి పదవి ఉద్వాసన పలికే అవకాశముందని?. కొత్త వారికి మంత్రివర్గంలో చోటు కల్పించనున్నట్లు తెలుస్తోంది. ఏ సామాజిక వర్గం నుంచి మంత్రిని తొలగిస్తే, ఆ సామాజిక వర్గం నుంచే మరొకరికి మంత్రి పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ మంత్రులను మార్చాల్సి వస్తే ఇప్పుడున్నవారిని తొలగించి? టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మాజీ మంత్రులు కళా వెంకట్రావు, పితాని సత్యనారాయణ వచ్చే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.రాష్ట్రంలో కొంతమంది మంత్రుల పని తీరుపై అసంతృప్తి వ్యక్తం అవుతుంది. ఇటు కార్యకర్తలు, అటు ప్రజలు మంత్రుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంత్రుల పనితీరుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే సందర్భంలో కొంత మంది మంత్రుల పనితీరు ఆశించినంతగా లేదని స్పష్టం అయింది. అందువల్లనే పట్టుమని పది నెలలు కూడా గడవక ముందే కొంత మంది మంత్రుల పట్ల వ్యతిరేకత మొదలైంది. ఇది ప్రభుత్వానికి, టీడీపీ పార్టీకి నష్టంగా ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వాటిని సరిచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృతనిశ్చయంతో ఉన్నారు.ఇప్పటికే మంత్రుల పనితీరుపై కూడా ఆయన దృష్టి పెట్టినట్లు సమాచారం. ఎందుకంటే మంత్రి సుభాష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు క్లాస్ పీకినట్లు ఆడియో రికార్డు సోషల్ మీడియాలో కూడా కొద్దిరోజుల కిందట వైరల్ అయింది. ఇలా మంత్రివర్గ సమావేశాల్లోనూ, ఇతర సమయాల్లో పనితీరు బాగోలేని మంత్రులకు, వివాదాలకు కేంద్ర బిందువు అయిన మంత్రులకు క్లాస్ తీసుకుంటున్నారని తెలుస్తోంది.మంత్రితీరు పని ఎలా ఉంది? పని చేయని మంత్రులెవరని సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు రిపోర్టు తెప్పించుకున్నట్లు సమాచారం. ఆ నివేదిక ఆధారంగానే ఇద్దరు మంత్రులను తొలగించే అవకాశం ఉందని టీడీపీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

# బీజేపీ వర్సెస్ టీడీపీ



**అనంతపురం, జనవరి 4, పెన్ పవర్::** జేసీ ప్రభాకర్ రెడ్డి వర్సెస్ నటి మాధవీలత మధ్య మాటల యుద్ధం సాగుతున్న విషయం తెల్సిందే. ఆ యుద్ధం మాధవీలతపై కేసు నమోదు వరకు దారితీసింది. ఈ విషయం ఇప్పుడు ఏపీ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారింది. తాజాగా ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడ స్పందించారు. మాధవీలతకు మద్దతు పలికిన మంత్రి సత్యకుమార్, జేసీకి ఒకదశలో వార్నింగ్ ఇచ్చారు. అయితే ఉదయం నుండి జేసీ వర్సెస్ మాధవీలత గురించి మీడియా, సోషల్ మీడియాలో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో అయితే అదిగో అరెస్ట్, ఇదిగో అరెస్ట్ అంటూ వదంతులు వ్యాపిస్తున్నాయి. ఇలా ఈ విషయం హాట్ టాపిక్ గా మారింది.ఇంత జరుగుతుంటే మాధవీలత మాత్రం బాగా నిద్రపోయారట. అదికూడ నిద్ర లేచి చూసేసరికి ఫోన్ నిండా మిస్డ్ కాల్స్ ఉన్నాయట. తన ఫేస్ బుక్ అకౌంట్ ద్వార మాధవీలత స్పందిస్తూ.. తనకు బాగా మైగ్రేన్ తలనొప్పి ఉందని, అందుకు బాగా నిద్రపోయానని ప్రకటించారు. అలాగే తన ఫోన్ కు ఎందరో మీడియా ప్రతినిధులు ఫోన్లు చేశారని, నిద్ర లేచి ఫోన్ చూసి ఖంగుతిన్నట్లు తెలిపారు. వాట్సప్ ఓపెన్ చేసినా కూడ, తన న్యూస్ లే తనకు కనిపిస్తున్నాయని ఇదెక్కడి రాద్ధాంతమంటూ ఆమె తన అభిప్రాయం వ్యక్తం చేశారు.తాడిపత్రిలో దివాకర్ ట్రావెల్స్ కుచెందిన బస్సులు తగలబడటం వెనుక బీజేపీ నేతలున్నారని జేసీప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. డిసెంబర్ 31వ తేదీన మహిళలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తే బీజేపీ నేతలు విమర్శలు చేశారని.. అయినా తాను నిర్వహించానని అందుకే బస్సులు తగులబెట్టారన్నారు. ఈ క్రమంలో ఆయన బూతులు అందుకోవడంతో బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రిలోని పెన్నా నది ఒడ్డున జేసీ పార్కులో డిసెంబర్ 31న వేడుకలు నిర్వహించారు. ఈ పార్కులో నిర్వహించే వేడుకలకు వెళ్లవద్దని మాధవీలత ఓ వీడియో రిలీజ్ చేశారు. అక్కడ మహిళలకు భద్రత లేదని .. జేసీ పార్కు వద్ద గంజాయి, డ్రగ్స్ బ్యాచ్‌లు ఉంటాయని ఆరోపించారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ పూర్తి చేసుకుని వెళ్లే సమయంలో మత్తులో వాళ్లు ఏమైనా చేయవచ్చని అన్నారు. మాధవీలత వ్యాఖ్యలపై జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. పట్టణ మహిళలకు అవమానం జరిగేలా మాట్లాడారని అన్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మాధవీలతపై తాడిపత్రిలో పోలీసు స్టేషన్‌లో రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కుంకరి కమలమ్మతో పాటు టీడీపీ మహిళా కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. ఆమెపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని కోరారు. జనవరి 2వ తేదీన తెల్లవారిజామున జేసీ బస్సులు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తేల్చారు. కానీ ఇది బీజేపీ నాయకుల పనే అని జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. జగనే నయం అని.. జగన్ కేవలం తన బస్సులను సీజ్ చేయించారని.. కానీ మీరు మాత్రం బస్సులు తగలబెడుతున్నారంటూ బీజేపీ నాయకులపై ఆరోపణలు చేశారు. ఈ ఘటనపై తాను ఫిర్యాదు చేయనని.. పోలీసులే సుమోటోగా కేసు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కూటమిలో ఉంటూ ఇలా మాట్లాడటం తగదని బీజేపీ నేతలు జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బీజేపీపై జేసీ ప్రబాకర్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఏం మాట్లాడతారో ఆయనకే తెలీదని విమర్శించారు. జేసీ వ్యాపారాలపై గతంలో ఎన్నో ఆరోపణలు వచ్చాయన్నారు. కూటమిలో ఉన్న బీజేపీపై జేసీ ప్రభాకర్‌రెడ్డి అర్థంలేని వ్యాఖ్యలు చేయడం సరికాదని మంత్రి సత్యకుమార్ తెలిపారు. జేసీ ఆయన వయసుకు తగిన విధంగా నడుచుకోవాలని మంత్రి సత్యకుమార్ హితవు పలికారు.

# రైల్వే జోన్ డీపీఆర్ పై రాని క్లారిటీ...

**విశాఖపట్టణం, జనవరి 4, పెన్ పవర్:** ఉత్తరాంధ్రలోని విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుపై ఇంకా స్పష్టత రావడం లేదు. ప్రతిసారి రైల్వే జోన్ అంటూ ఏదో ఒక అప్‌డేట్ వస్తుంది, కానీ కనీసం శంకుస్థాపన కూడా జరగలేదు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక గతంలోనే సిద్ధం చేసినా ఇంకా ఆమోదం రాకపోవడం హాట్ టాపిక్ అవుతోంది. అసలే ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ పర్యటన ఫిక్స్ అని, ఆయన రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తారన్న ప్రచారం స్థానికంగా ఊపందుకుంది. తీరా చూస్తే డీపీఆర్‌కు ఆమోదం రాకుండా, శంకుస్థాపన జరుగుతుందా.. ఇంతకీ ప్రధాని మోదీ వస్తారా లేదా కొత్త టెన్షన్ మొదలైంది. 8న ప్రధాని మోదీ ఏపీ పర్యటనరకు రానున్నారని, విశాఖ రైల్వే జోన్ పనులకు శంకుస్థాపన చేస్తారని ప్రచారం జరుగుతోంది. కానీ రియాలిటీకి వస్తే ముందు డీపీఆర్‌పై ఎటూ తేలలేదు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్రం ఫిబ్రవరి 2019లోనే ప్రకటింటించి. అదే ఏడాది డీపీఆర్ ను కూడా రూపొందించారు. రైల్వే జోన్ స్వరూపాన్ని చూపించే డీపీఆర్ మాత్రం ఇంకా ఆమోదం పొందలేదు. గతంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. కేంద్రం సిద్ధంగా ఉందని, అప్పటి వైసీపీ ప్రభుత్వం భూములు కేటాయించి ఇవ్వలేదని పేర్కొనడం రాజకీయంగా సంచలనం రేపింది. గతంలో ఆరిలోవ ప్రాంతంలో రైల్వే శాఖకు చెందిన 53 ఎకరాల్లో దక్షిణ కోస్తా రైల్వేజోన్ భవనానికి ప్రతిపాదనలు పంపినా కేంద్రం అందుకు ఆమోదించలేదన్న వాదన ఉంది. విశాఖ జోన్ లో వాల్తేరు డివిజన్ ఉంటుందా, లేదా అని క్లారిటీ రావాల్సి ఉంది.2022లో జోన్ ప్రధాన కార్యాలయ భవనం నిర్మాణానికి డీఆర్ఎం ఆఫీస్ ఎదురుగా ఉన్న వైర్ లెస్ కాలనీ



ఎంపికైంది. మొత్తం 13 ఎకరాల్లో 8 ఎకరాలలో హెడ్ క్వార్టర్స్ డిజైన్లను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదించారు. అంతా ఓకే అనుకునే లోపు 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్ గా శంకుస్థాపన చేయాల్సి ఉండగా.. చివరి నిమిషంలో ఆగిపోయింది.దక్షిణ కోస్తా రైల్వే జోన్ తో పాటు వాల్తేరు డివిజన్ లో కొంత భాగం, ఈస్ట్ కోస్ట్ లోని కొంత భాగంతో కొత్తగా రాయగడ డివిజన్ ను ప్రకటించారు. రైల్వే జోన్ కోసం రూ.106కోట్లు ప్రకటించగా.. రాయగడకు మాత్రం రూ.70కోట్లు మంజూరైంది. వాల్తేరు రైల్వే డివిజన్ ను విజయవాడ డివిజన్ లో కలిపి మొత్తం రూట్లు, లైన్లు ఖరారు చేశారు. రాయగడ డివిజన్ లైన్లు ఇప్పటికే ఖరారైనట్టు సమాచారం. జనవరి 6న ప్రధాని మోదీ వర్చువల్‌గా రాయగడ డివిజన్ కు శంకుస్థాపన చేయనున్నారని వినిపిస్తోంది.జనవరి 8న ప్రధాని మోదీ ఏపీ పర్యటనకు రానున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే అధికారులను ఆదేశించారు. విశాఖ రైల్వే జోన్ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ క్రమంలోనే ఏపీకి సంబంధించి ఏమైనా ప్రకటన చేస్తారా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

# సంక్రాంతికి వస్తున్నారా... రావట్లేదా

**విజయవాడ, జనవరి 4, పెన్ పవర్:** కాలర్ ఎగరేసుకుంటూ తిరిగే కొడాలి నాని ఇప్పుడు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు దూరంగా వెళ్లారు. ఎంతగా అంటే ఆయన కనిపించి కొన్ని నెలలు అవుతుంది. ఓటమి పాలయిన తర్వాత కొత్తలో కనిపించి కొంత హడావిడి చేసినట్లు కనిపించినా తర్వాత మాత్రం ఆయన మళ్లీ గాయబ్ అయ్యారు. ఆయన హైదరాబాద్ కే పరిమితమయ్యారంటున్నారు. ఆయన సన్నిహితులు, అనుచరులు ఎవరైనా కలవాలని భావించినా హైదరాబాద్ కు రావాలని సూచిస్తున్నారట.ఆయన గుడివాడకు వచ్చికూడా చాలా రోజులయింది. ఇక సంక్రాంతి పండగకు కొడాలి నాని వస్తారా? రారా? అన్న చర్చ కూడా గుడివాడ ప్రాంతంలో జోరుగా సాగుతుంది. ఇక తాజాగా కొడాలి నాని ప్రధాన అనుచరుడు కాళిని పోలీసులు అరెస్ట్ చేయడంతో ఆయనను కూడా అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జరుగుతుంది. గుడివాడలో గెలుపునకు తనకు తిరుగులేదనుకున్న కొడాలి నానికి మొన్నటి ఎన్నికల్లో తొలిసారి ఓటమి ఎదురయింది. పార్టీలు మారినా గుడివాడ ప్రజలు కొడాలి నానిని అదరించారు. కానీ మొన్నటి ఎన్నికల్లో మాత్రం ఆయనకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. నిజానికి ఆ ఓటమిని తాను కూడా ఊహించలేదు. గుడివాడ ప్రజలు తనను వదులుకోరని కొడాలని నాని పూర్తి విశ్వాసంతో ఉన్నారు. కానీ ప్రజలు మార్పు కోరుకుంటే ఎలాంటి ఫలితాలు వస్తాయో మొన్నటి ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయి. దీనికి ప్రధాన కారణం అభివృద్ధి పనులను పక్కన పెడితే ఆయన వాడిన భాష రాష్ట్ర స్థాయిలో జనంలో పెద్ద చర్చగా మారింది. రచ్చగా మారి అది ఓటర్లపై ప్రభావం చూపిందంటున్నారు.2004 కొడాలి నాని టీడీపీ నుంచి తొలిసారి గుడివాడ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 ఎన్నికలకు వచ్చేసరికి వైసీపీలోకి వెళ్లారు.ఆ ఎన్నికలలో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం వెనిగండ్ల రాము చేతిలో ఓటమి పాలయ్యారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేశారు. అయితే ఆయన చంద్రబాబు నాయుడు, ఆయన కుటుంబ సభ్యులపై చేసిన విమర్శలతో జనంలోకి చొచ్చుకుని మరింతగా వెళ్లవచ్చునని అనుకన్నారు కానీ అది రివర్స్ అయింది. ఆయన మాటలు, బూతులు విన్న వారంతా ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేశారు. అందుకే కౌంటింగ్ జరుగుతున్నసమయంలోనే కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇక అప్పటి నుంచి కొడాలి నాని పెద్దగా యాక్టివ్ గా లేరు. ఎందుకంటే ఆయనకు కేసుల భయం పట్టుకుంది. తనను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేస్తారని తెలుసు. ఇప్పటికే కొడాలి నాని అనుచరులు అనేక కేసుల్లో అరెస్ట్ అయ్యారు. ఇదేజిల్లాలో మరో మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబంపై కూడా కేసులు నమోదు అయ్యాయి. దీంతో కొడాలినాని కూడా కొంత కేసుల భయం పట్టుకుందని చెబుతున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి కొడాలి నాని విషయంలో వెనక్కు వెళ్లవద్దంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వత్తిడులు కూడా ఎక్కువయ్యాయంటున్నారు. అదే సమయంలో నారా లోకేష్ రెడ్ బుక్ లోనూ కొడాలి నాని పేరు మొదటి పేజీలో ఉందన్న కామెంట్స్ ఆయనకు నిద్రలేకుండా చేస్తున్నాయి.

# ఒకరికి ఒకరు.... కొనసాగుతున్న స్నేహబంధం



**కాకినాడ, జనవరి 4, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో శాసనసభ ఎన్నికలకు ముందు అనేక ఊహాగానాలు వినిపించాయి. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలవబోరని దాదాపు చాలా మంది అంచనా వేశారు. బీజేపీ ఏదో ఒకటి చేసి కూటమి ఏర్పాటు కాకుండా చూసుకుంటుందన్నభరోసాలో దిలాసాగా వైసీపీ నేతలు కూడా ఉన్నారు.చివరకు పట్టుబట్టి సాధించి మరీ కూటమిని ఏర్పాటు చేశారు. అయితే కూటమి ఏర్పాటు తర్వాత కూడా దీనిపై అనేక రకాలుగా ప్రచారం సాగింది. అభ్యర్థుల ఎంపికలోనూ, సీట్ల కేటాయింపుల్లోనూ విభేదాలు తలెత్తుతాయని భావించారు.కానీ ఎన్నికలకు చాలా కంఫర్ట్ గా మూడు పార్టీలు కలిసి వెళ్లడంతో ఆశలు పెట్టుకున్నవాళ్లంతా అవాక్కయ్యారు. ఇక అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈరకమైన ప్రచారం ఆగలేదు. మంత్రి వర్గం ఏర్పాటు దగ్గర నుంచి మొదలయిన ఈ ప్రచారం ఇంకా సాగుతూనే ఉంది. అసంతృప్తులు బయలుదేరుతాయని ఎవరికి వారు ప్రత్యర్థులు అంచనా వేసుకున్నారు. కానీ అంతా సాదాసాదీగా, సాఫీగా జరిగిపోయింది. ఇక నామినేటెడ్ పోస్టుల భర్తీ సమయంలోనూ అనేక వదంతులు షికార్లు చేశాయి. నామినేటెడ్ పోస్టుల కోసం ఇటు జనసేన, అటు బీజేపీ పట్టుబడుతుందన్న ఊహాగానాలు చెలరేగగా అవి ఊహలకే పవన్, చంద్రబాబులు పరిమితం చేశారు. నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసినప్పటికీ ఎలాంటి అసంతృప్తులు రాలేదు. ఒకవేళ పార్టీ నేతల్లో ఉన్న ఇంకా అనేక పదవులు వచ్చేవి ఉండటంతో మౌనంగా ఉన్నారన్నా అనుకోవాలి. కానీ ఇక్కడ ఒక విషయం మాత్రం గుర్తుంచుకోవాలి... అగ్రనేతలు అందరూ కలసి కట్టుగానే ఈ ఏడు నెలల నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. ఎక్కడా కొద్దిగా కూడా పొరపొచ్చాలు రాలేదు. అనేక నిర్ణయాలు తీసుకున్నా ఇటు పవన్ కల్యాణ్ నుంచి కూడా పెద్దగా వ్యతిరేక వ్యాఖ్యలు వెలువడలేదు. ఒకహోంశాఖపైనే ఆయన నేరుగా కామెంట్ చేయడం కొంత కలకలం రేపింది. ఎందుకంటే హోంశాఖను నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షిస్తుండటంతో తేడా కొట్టిందన్న కామెంట్స్ వినపడ్డాయి. కానీ చంద్రబాబు వెంటనే ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టి తామిద్దరమూ ఒక్కటేనన్న సంకేతాలను ఇటు పార్టీ నేతలకు, అటు ప్రత్యర్థులకు బలంగా పంపగలిగారు. ఇద్దరూ ఇప్పటి వరకూ ఏ అంశంపైనా విభేదించుకున్న దాఖలాలు లేవు. ఇకముందు కూడా ఉండవన్న ధీమా ఆ పార్టీల క్యాడర్ లో కనపడుతుంది. ఎందుకంటే పవన్ అడిగింది చంద్రబాబు కాదనడం లేదు.. అలాగే చంద్రబాబు చెప్పినదానికి పవన్ కల్యాణ్ ఓకే అని చెబుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. పట్టు విడుపులతో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. రాజకీయంగా జగన్ ను ఎదుర్కొనాలంటే కలసి ప్రయాణంచేయడం ఒక్కటేనన్న అభిప్రాయానికి ఇద్దరు నేతలు వచ్చారు. అందుకే ఎవరేమి అన్నా, ఏ విషయంలోనైనా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు. పైగా పవన్ కల్యాణ్ ఏకంగా పదేళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండాలని ఆకాంక్షించారంటే ఆయన ఏ రేంజ్ లో చంద్రబాబు అంటే గౌరవమో చెప్పకనే తెలుస్తోంది. సో.. ఇద్దరూ విడిపోతారన్న ఆశలు ఎవరు పెట్టుకున్నా అవి అడియాసలు కాక తప్పవు బ్రదరూ.

# జస్ప్రీత్ బుమ్రా గాయం గురించి ప్రసిద్ధ్ కృష్ణ ఏమన్నాడంటే...!

**సిడ్నీ వేదికగా ఆసీస్, భారత్ ఐదో టెస్టు**

**గాయం కారణంగా మ్యాచ్ మధ్యలో మైదానం వీడిన బుమ్రా**

**బుమ్రా వెన్నునొప్పితో బాధపడుతున్నట్లు తెలిపిన ప్రసిద్ధ్ కృష్ణ**

**స్కానింగ్ రిపోర్ట్స్ వచ్చిన తర్వాత మరింత స్పష్టత వస్తుందని వెల్లడి**





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో సిడ్నీ వేదికగా జరుగుతున్న ఆఖరిదైన ఐదో టెస్టు రెండో రోజు మధ్యలోనే భారత జట్టు తాత్కాలిక కెప్టెన్ బుమ్రా మైదానం వీడిన విషయం తెలిసిందే. 31వ ఓవర్ ముగిసిన తర్వాత గాయం కారణంగా అకస్మాత్తుగా మైదానం వీడాడు. రెండో రోజు మొదటి సెషన్‌లో కీలకమైన మార్నస్ లబుషేన్‌ను పెవిలియన్‌కు పంపించిన బుమ్రా... రెండో సెషన్ మధ్యలోనే గ్రౌండ్ నుంచి బయటకు వెళ్లిపోయాడు. అనంతరం వైద్య బృందంతో కలిసి స్కానింగ్ కోసం ఆసుపత్రికి వెళ్లాడు. దీంతో భారత అభిమానులు ఆందోళనకు గురయ్యారు. తీవ్ర గాయం కావడం వల్లే మైదానం వీడాడని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు బుమ్రాకు అయిన గాయం ఏంటి? అనే దానిపై మరో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ తాజాగా అప్‌డేట్ ఇచ్చాడు. “బుమ్రా వెన్నునొప్పితో బాధపడుతున్నట్లు తెలిపాడు. స్కానింగ్ కోసం ఆసుపత్రికి వెళ్లాడని, వైద్య బృందం అతడిని పర్యవేక్షిస్తోందని చెప్పాడు. స్కానింగ్ రిపోర్ట్స్ వచ్చిన తర్వాత మరింత స్పష్టత వస్తుంది” అని చెప్పుకొచ్చాడు. “జస్ప్రీత్ బుమ్రాను సిడ్నీలోని సెంటెనియల్ పార్క్ ప్రాంతంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతడు వెన్ను నొప్పితో బాధపడుతున్నాడు. ప్రస్తుతం స్కానింగ్ చేస్తున్నారు. సాయంత్రంలోగా రిపోర్ట్స్ వస్తాయి. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడానికి బుమ్రా సిద్ధంగా ఉన్నాడు. అయితే, బౌలింగ్ చేయాలా వద్దా అనేది ఆదివారం అతని పరిస్థితిని బట్టి తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది” అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

# చాహల్- ధనశ్రీ వర్మ విడాకులు తీసుకోబోతున్నారా..?




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ అతని భార్య ధనశ్రీ వర్మ విడిపోతున్నారనే వార్తలు కొంతకాలంగా చక్కర్లు కొడుతున్నాయి. వీరు విడిపోతున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు తెగ హల్ చల్ చేశాయి. ఇది ఎంతవరకు వాస్తవం అనే విషయం అధికారికంగా తెలియదు. ఇదిలా ఉంటే వీరిద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం వైరల్ గా మారుతోంది. చాహల్ తన ఖాతా నుంచి ధనశ్రీ వర్మ ఫొటోలను డిలీట్ చేశాడు. దీంతో వీరిద్దరూ విడిపోతారనే వార్తలకు బలం చేకూరింది. చాహల్‌ను ధనశ్రీ ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేసినప్పటికీ అతడితో ఉన్న ఫొటోలను మాత్రం డిలీట్ చేయలేదు. వస్తున్న సమాచార ప్రకారం చాహల్, ధనశ్రీ త్వరలో విడిపోతారని.. అయితే కచ్చితమైన కారణాలు తెలియదని సంబంధింత వర్గాలు వెల్లడించాయి. 2020లో చాహల్, ధనశ్రీ వివాహం చేసుకున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ జంట.. త్వరలో ఎలాంటి ట్విస్ట్ ఇస్తుందో చూడాలి. ప్రస్తుతం చాహల్ భారత జట్టులో స్థానం కోసం పోరాడుతున్నాడు. ఇటీవలే ఐపీఎల్ మెగా ఆక్షన్ లో చాహల్ ను పంజాబ్ కింగ్స్ రూ. 18 కోట్ల రూపాయాల భారీ ధరకు దక్కించుకుంది. ప్రస్తుతం చాహల్ కు భారత జట్టులో చోటు దక్కడం కష్టంగానే కనిపిస్తుంది. టీ20 వరల్డ్ కప్ 2024 స్క్వాడ్ లో స్థానం దక్కినా అతనికి ఆడే అవకాశం రాలేదు. ఆ తర్వాత సెలక్టర్లు చాహల్ పూర్తిగా పక్కన పెట్టేశారు. భవిష్యత్ లోనూ చాహల్ భారత జట్టులోకి రావడం కష్టంగానే కనిపిస్తుంది. అతని వయసు 34 ఏళ్ళు కావడం దీనికి ప్రధాన కారణం. 34 ఏళ్ల చాహల్ ఇప్పటివరకు భారత్ తరఫున 72 వన్డేలు, 80 టీ20లు ఆడాడు. రెండు ఫార్మాట్లలో కలిపి 217 వికెట్లు పడగొట్టాడు.

# ఔటయ్యాక సిడ్నీలో కోహ్లీకి స్టాండింగ్ ఒవేషన్.. కారణమేంటంటే..?


**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో విఫలమవుతున్న సంగతి తెలిసిందే. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో సెంచరీ మినహాయిస్తే మిగిలిన ఇన్నింగ్స్ ల్లో విఫలమయ్యాడు. దీంతో కోహ్లీపై దిగ్గజాలు విమర్శలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం సిడ్నీ వేదికగా జరుగుతున్న చివరి టెస్టులోనూ కోహ్లీ రెండు ఇన్నింగ్స్ ల్లో సింగిల్ డిజిట్ కే పెవిలియన్ చేరాడు. చివరిదైన ఐదో టెస్టు రెండో రోజు ఆటలో భాగంగా శనివారం (జనవరి 4) కోహ్లీ 6 పరుగులకే కింగ్ ఔటయ్యాడు. కోహ్లీ ఔట్ అయ్యి డగౌట్ కి వెళ్తున్న సమయంలో అతనికి ఆస్ట్రేలియా అభిమానులు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. అభిమానులు కోహ్లీకి స్టాండింగ్ ఒవేషన్ ఇవ్వడంలో కారణం లేకపోలేదు. ఆస్ట్రేలియా గడ్డపై కోహ్లీ దాదాపు చివరి టెస్ట్ ఇన్నింగ్స్ ఆడేశాడు. ఎందుకంటే భారత్ 2028 లో ఆస్ట్రేలియాలో పర్యటిస్తుంది. అప్పటిలోపు కోహ్లీ టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ఇచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మరో నాలుగేళ్లపాటు విరాట్ టెస్టుల్లో కొనసాగడం దాదాపు అసాధ్యం. ఈ కారణంగానే అతనికి సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ లో స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. టెస్టుల్లో కోహ్లీకి ఆస్ట్రేలియాపై అద్భుతమైన రికార్డ్ ఉంది. 2014-15 ఆసీస్ పర్యటనలో ఏకంగా నాలుగు సెంచరీలు చేశాడు. ఆస్ట్రేలియాలో అతని ఫ్యాన్ బేస్ కూడా ఓ రేంజ్ లో ఉంది. బోర్డర్ గవాస్కర్ సిరీస్ కు ముందు ఆస్ట్రేలియా మీడియా విరాట్ కోహ్లీని తెగ హైలెట్ చేసింది. అక్కడ వార్తా పత్రికలపై కోహ్లీని పొగడ్తలతో ముంచేసింది. ముఖ్యంగా ఆస్ట్రేలియాలో ప్రముఖ న్యూస్ పేపర్ ‘ది డైలీ టెలిగ్రాఫ్’లో కోహ్లీ ఫొటోను ఫ్రంట్ కవర్ పేజీపై ప్రచురించింది. ఈ మ్యాగజిన్ లో కోహ్లీ క్రికెట్ లో సాధించిన ఘనతలు గురించి రాసుకొచ్చింది. కోహ్లీ సాధించిన రికార్డుల గురించి ఈ మ్యాగజిన్ లో రాయడం విశేషం.

# శ్రీలీల.. అక్కడ బిగ్గెస్ట్ ఎంట్రీ ఇస్తోందిగా

యంగ్ బ్యూటీ శ్రీలీల.. వరుస సినిమాలతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. కన్నడ చిత్రంతో తెరంగేట్రం చేసిన అమ్మడు.. పెళ్లి సంద%ఈ% సినిమాతో టాలీవుడ్ కు పరిచయమైంది. ఏ ముహూర్తాన తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిందో కానీ.. వెంటనే స్టార్ హీరోల సరసన ఛాన్స్ లు సొంతం చేసుకుని లక్కీ గర్ల్ గా మారిపోయిందనే చెప్పాలి.మాస్ మహారాజా రవితేజ ధమాకా, నటసింహం బాలకృష్ణ భగవంత్ కేసరితో మంచి హిట్స్ అందుకున్న తర్వాత ఆమె నటించిన వరుస సినిమాలు నిరాశపరిచాయి. ఆ తర్వాత చిన్న గ్యాప్ తీసుకున్న అమ్మడు.. ఇప్పుడు మళ్లీ వరుసగా సినిమాలతో బిజీగా మారింది. గత సినిమాల ఫలితం ఎలా ఉన్నా.. శ్రీలీలను తీసుకోవడానికి మేకర్స్ తెగ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారని చెప్పాలి.రీసెంట్ గా పుష్ప-2 ది రూల్ మూవీలో అల్లు అర్జున్ సరసన కిస్సిక్ సాంగ్ లో చిందులేసిన శ్రీలీల.. ఓ రేంజ్ లో ప్రశంసలు అందుకుంది. గ్లామర్ స్టెప్పులేసి ప్రేక్షకులను, కుర్రాళ్లను విపరీతంగా ఆకట్టుకుందనే చెప్పాలి. ఇప్పుడు తెలుగులో అక్కినేని బ్రదర్స్ నాగచైతన్య, అఖిల్ సినిమాల్లో నటిస్తున్న ఆమె చేతిలో పవన్ ఉస్తాద్ భగత్ సింగ్ కూడా ఉంది. దాంతోపాటు హీరో శివ కార్తికేయన్ తో మూవీ చేస్తున్న శ్రీలీల.. త్వరలో కోలీవుడ్ లోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. నేషనల్ అవార్డు విన్నింగ్ డైరెక్టర్ సుధ కొంగర తెరకెక్కిస్తున్న మూవీలో ఆమె నటిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ గురించి ఎప్పటి నుంచో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే.ఆ మధ్య రానా టాక్ షోకు వచ్చినప్పుడు బాలీవుడ్ ఎంట్రీ కోసం ఇన్ డైరెక్ట్ గా క్లారిటీ ఇచ్చింది శ్రీలీల. అయితే బాలీవుడ్ స్టార్ హీరో కార్తిక్ ఆర్యన్ తో ఆమె బీటౌన్ లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు ఇప్పుడు జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే వరుస హిట్స్ అందుకుని కార్తీక్ ఆర్యన్ దూసుకుపోతున్న విషయం తెలిసిందే.ఇప్పుడు ఆయన హీరోగా తు మేరీ మై తేరా.. మై తేరా తు మేరీ మూవీ అనౌన్స్మెంట్ వచ్చింది. బాలీవుడ్ బిగ్గెస్ట్ ప్రొడక్షన్ కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సమీర్ విద్వాన్స్ తెరకెక్కిస్తున్నారు. ఆ మూవీలో శ్రీలీల హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మేకర్స్ ఆ విషయాన్ని అనౌన్స్ చేయనున్నారని సమాచారం. మొత్తానికి యంగ్ బ్యూటీ.. బిగ్గెస్ట్ ప్రొడక్షన్ హౌస్ తో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తుందని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు.





స్పాట్‌లైట్‌ని దొంగిలించిన నికితా శర్మ షాట్స్



సంజీదా షేక్ ఈ దుస్తులలో శాశ్వతమైన ముద్ర వేసింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com